# అధ్యాయం-4

## జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకం (జేఎన్ఎన్‌యూఆర్ఎమ్) అమలుపై ఆడిట్ సమీక్ష

మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ

పేజీలు 77 - 114

## 4.1 ఉపోద్ఘాతం

### 4.1.1 జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ లక్ష్యాలు

జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ పథకాన్ని (జేఎన్ఎన్‌యూఆర్ఎమ్) భారత ప్రభుత్వం ఏడు సంవత్సరాల కార్యాచరణ (2005-12) తో 2005 డిసెంబరులో ప్రవేశపెట్టింది. పట్టణ మౌలిక వసతులు, సౌకర్యాలను మెరుగుపరిచే వ్యవస్థ సామర్థ్యం మీద దృష్టి సారించి, పట్టణ స్థానిక సంస్థలు/ఇతర సంస్థలకు ప్రజలపట్ల జవాబుదారీతనం, సామాజిక భాగస్వామ్యం పెంపొందే విధంగా ఎంపిక చేసుకున్న నగరాల ఆధునికీకరణకూ, త్వరితగతిన ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికీ దోహదపడటం కోసం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారు.

### 4.1.2 ఉప-కార్యాచరణలు, అంశాలు

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ లోని రెండు ప్రధాన ఉప-కార్యాచరణలు ఈ విధంగా ఉన్నాయి :

- పట్టణ మౌలిక వసతులు, పాలన (యూఐజీ )ని పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (కేంద్ర ప్రభుత్వం) నిర్వహిస్తుంది. మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదల, ఘన వ్యర్థాల నిర్వహణ, రహదారులు, పట్టణ రవాణా, పాతబస్తీ పునరాభివృద్ధి ఇందులో ఉంటాయి ;

- గృహనిర్మాణం, పట్టణ పేదరిక నిర్మూలన మంత్రిత్వ శాఖ నిర్వహణలో పట్టణ పేదలకు ప్రాథమిక సౌకర్యాల పేరిట (బీఎస్‌యూపీ) మరొక ఉప-కార్యాచరణ పని చేస్తున్నది. పట్టణ పేదలకు గృహవసతి, ప్రాథమిక సౌకర్యాలు, ఇతర సామాజిక సదుపాయాలు కల్పించేదిశగా మురికివాడల సమీకృత అభివృద్ధిని ఈ ఉప-కార్యాచరణలో చేపడతారు.

ఈ పథకం కిందికిరాని చిన్న, మధ్యతరహా పట్టణాల (నాన్ మిషన్ సిటీలు) కోసం జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ ఈ దిగువ పేర్కొన్న రెండు అంశాలను చేపట్టింది :

- చిన్న, మధ్యతరహా పట్టణాలలో మౌలిక వసతుల అభివృద్ధి పథకాన్ని (యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ) పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ నిర్వహిస్తుంది. మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల, ఘనవ్యర్థాల నిర్వహణ, రహదారులు మొదలైన మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ఇది కృషి చేస్తుంది.

- గృహనిర్మాణం, పట్టణ పేదరిక నిర్మూలన మంత్రిత్వశాఖ నిర్వహణలో సమీకృత గృహనిర్మాణం, మురికివాడల అభివృద్ధి పథకం (ఐహెచ్ఎస్‌డీపీ) అనే అంశం కింద మురికి వాడల ప్రజలకు అవసరమైన గృహవసతి, ప్రాథమిక సౌకర్యాలు సమకూర్చి ఆరోగ్యకర, సమర్థక వాతావరణంతో పట్టణాభివృద్ధికి ఇది పాటుపడుతుంది.

2001 జనాభా లెక్కలననుసరించి, 65 నగరాలు/శివారులను జేఎన్ఎన్‌యూఆర్ఎమ్‌లోని మూడు వర్గాల కింద 'మిషన్ సిటీలు'గా గుర్తించారు. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హైదరాబాద్ (ఎ-వర్గం), విశాఖపట్నం, విజయవాడ (బి-వర్గం), తిరుపతి[1] (సి-వర్గం) ఉన్నాయి. మిగతా నాన్‌మిషన్ సిటీలకు జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ ప్రధాన ఉప కార్యాచరణలైన యూఐజీ , బీఎస్‌యూపీ ప్రయోజనాలు వర్తించవు. ఐతే, జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పథకంలోని చిన్న ఉప ప్రణాళికలైన యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ, ఐహెచ్ఎస్‌డీపీ కింద ఆర్థిక సాయం పొంద వచ్చును.

1 జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పథకం కింద మిషన్-సిటీగా 2009లో గుర్తించారు

### 4.1.3 జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎమ్ వ్యూహం

తన లక్ష్యాలను సాధించటంకోసం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎమ్ ఈ దిగువ పేర్కొన్న వ్యూహాలను రూపొందించుకుంది :

- వివిధ కార్యక్రమాలను, విధానాలను, వ్యూహాలను, ఆర్థిక ప్రణాళికలను సూచిస్తూ, అలాగే అవసరమైన ప్రాజెక్టుల నిర్ధారణకు వీలుకల్పిస్తూ ***నగరాభివృద్ధి ప్రణాళికనొకదాన్ని (సీడీపీ)*** రూపొందించటం;
- ప్రాజెక్టుల ప్రణాళికాబద్ధ దిక్చక్రం మీద జీవన వర్తుల వ్యయాలు అభిలషణీయ స్థాయిలో ఉండేలా భరోసా నివ్వగల వివిధ ప్రాజెక్టులను వాటి నిర్ధరిత పరిధిలోనే చేపట్టే విధంగా ***సమగ్ర ప్రణాళికా నివేదికలను (డీపీఆర్)*** రూపొందించటం;
- పట్టణ స్థానిక సంస్థలకు/పాక్షిక ప్రభుత్వ రంగ సంస్థలకు మృదుల ఋణాలుగానో, గ్రాంట్ల రూపంలోనో నిధులు పంపిణీ చేసేందుకు వీలుగా రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ (ఎస్‌ఎల్‌ఎన్‌ఏ)కి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ***నిధులు విడుదల చేయటం***; ఈ నోడల్ ఏజన్సీ/పట్టణ స్థానిక సంస్థలు ఇతర వనరులనుంచి కూడా ***అదనపు నిధులు సమీకరించుకుంటాయి***;
- అభివృద్ధి, నిర్వహణ, ప్రాజెక్టుల నిర్వహణ, పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిన ***ప్రైవేటు రంగంలోని నిపుణతను అందిపుచ్చుకోవటం.***

### 4.1.4 సంస్కరణల ప్రణాళిక

జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎమ్ జాతీయ స్థాయిలో సంస్కరణలతో ముడివడిన పెట్టుబడి ప్రేరణ కావటంతో ఈ పథకం కింద కేంద్ర సాయంపొందాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు, పట్టణ స్థానిక సంస్థలు (పాక్షిక ప్రభుత్వరంగ సంస్థలు కూడా) కేంద్ర ప్రభుత్వంతో ఒక త్రైపాక్షిక ఒప్పంద పత్రం రాసుకోవలసి ఉంటుంది. వివిధ సంస్కరణలకు సంబంధించి నిర్దిష్ట మైలు రాళ్ళను సూచిస్తూ సంస్కరణల ప్రణాళికను ఈ ఒప్పందంలో పొందుపరచాలి. ప్రతి నగరానికీ ఎన్నికకాబడిన పాలక వర్గం ఉండటం కూడా కేంద్ర ప్రభుత్వ సాయం పొందటానికి మరొక ముఖ్య నిబంధన.

### 4.1.5 నిధుల సమీకరణ

భిన్న వర్గాలలోని ప్రాజెక్టులకు నిధుల సమీకరణ ఈ విధంగా ఉంటుంది :

పట్టిక 4.1

(శాతంలో)

| వర్గం | యూఐజీ | | | బీఎస్‌యూపీ | | యూఐడీఎస్‌ఎస్‌ఎమ్‌టీ | | | ఐహెచ్‌ఎస్‌డీపీ | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | గ్రాంటు | | యూఎల్‌బీ లేదా ఇతర సంస్థల వాటా/ఆర్థిక సంస్థల నుంచి ఋణాలు | గ్రాంటులో కేంద్రం వాటా | రాష్ట్రం, పట్టణ స్థానిక సంస్థలు, ఇతర సంస్థల వాటా (లబ్ధిదారుల వాటా కలుపుకుని) | గ్రాంటు | | నోడల్/అమలు సంస్థలు, ఆర్థిక సంస్థల నుంచి ఋణాలు | గ్రాంటులో కేంద్రం వాటా | రాష్ట్రం, పట్టణ స్థానిక సంస్థలు, ఇతర సంస్థల వాటా (లబ్ధిదారుల వాటా కలుపుకుని) |
| | కేంద్రం | రాష్ట్రం | | | | కేంద్రం | రాష్ట్రం | | | |
| వర్గం-ఎ మిషన్ సిటీలు | 35 | 15 | 50 | 50 | 50 | 80 | 10 | 10 | 80 | 20 |
| వర్గం-బి మిషన్ సిటీలు | 50 | 20 | 30 | | | | | | | |
| వర్గం-సి, ఇంకా ఇతర నగరాలు | 80 | 10 | 10 | 80 | 20 | | | | | |

*మూలం : జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎమ్ మార్గదర్శకాలు*

### 4.1.6 సంస్థాగత నిర్మాణం

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కేంద్ర స్థాయిలో ఒక జాతీయ స్టీరింగ్ గ్రూప్ (ఎన్ఎస్‌జీ) సమగ్ర పర్యవేక్షణలో పనిచేస్తుంది. ఇది ఆచరణ విధానాలను రూపొందించి పర్యవేక్షించటం, పురోగతిని సమీక్షించటంతోపాటు, అవసరమైనప్పుడు దిద్దుబాటు చర్యలను కూడా సూచిస్తుంది. ఎన్ఎస్‌జీ కి ఊతంగా ఒక సాంకేతిక సలహా సంఘం (టీఏజీ) అవసరమైన ప్రతిపాదనలను రూపొదిస్తుంది. అదేవిధంగా, కేంద్రీయ అనుమతి, పర్యవేక్షణ సమితి (సీఎస్ఎమ్‌సీ) ఈ ప్రతిపాదనలను మరోమారు పరిశీలించి అనుమతి జారీ చేస్తుంది. ప్రతిపాదనలను సీఎస్ఎమ్‌సీ ఆమోదం కోసం సమర్పించే ముందు సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలలోని సాంకేతిక విభాగాలు, ప్రత్యేక సాంకేతిక సంస్థలు పరిశీలిస్తాయి.

రాష్ట్ర స్థాయిలో ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్‌సీ) సమన్వయిస్తుంది. దీనికి ముఖ్య మంత్రి/పట్టణాభివృద్ధి మంత్రి, గృహనిర్మాణ మంత్రి నేతృత్వం వహిస్తారు. ప్రతిపాదనలన్నీ సమీక్షించి, వాటికి ప్రాధాన్యతలను నిర్ధరించి, వాటిని జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కిందికి తెచ్చేందుకూ, కేంద్రం నుంచి సాయం పొందేందుకూ ఇది కృషి చేస్తుంది. ఎస్ఎల్ఎస్‌సీ ఈ దిగువ వివరించిన విధంగా వివిధ ఏజన్సీల సాయంతో పనిచేస్తుంది :

| ఏజన్సీ | కార్యకలాపాలు | రిమార్కులు |
|---|---|---|
| రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ (ఎస్ఎల్ఎన్ఏ) | పట్టణ స్థానిక సంస్థలు/పాక్షిక ప్రభుత్వరంగ సంస్థలు సమర్పించిన ప్రాజెక్టులను పరిశీలించి ఎస్ఎల్ఎస్‌సీ ఆమోదం పొందటం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన గ్రాంటుల నిర్వహణ, పట్టణ స్థానిక సంస్థలకు/పాక్షిక ప్రభుత్వరంగ సంస్థలకు నిధులివ్వటం, నిర్వహణ పనులకు రివాల్వింగ్ ఫండ్ వినియోగించటం, ఒప్పందంలో పేర్కొన్నట్లు సంస్కరణ పనులను పర్యవేక్షించటం, ప్రాజెక్టుల పురోగతిని గమనించటం. | ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీయూఎఫ్ఐడీసీ)ను ప్రభుత్వం 2006 ఫిబ్రవరిలో రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీగా నియమించింది. |
| కార్యక్రమ నిర్వహణ విభాగం (పీఎమ్‌యూ) | కార్యక్రమ నిర్వహణ, పర్యవేక్షణలపై దృష్టిసారించి, అవసరమైన సాంకేతిక, నిర్వాహక సహాయమందిస్తూ, తన బాధ్యతలు నెరవేర్చటంలో రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీకి సాయపడుతుంది. | ఆంధ్రప్రదేశ్‌కు పీఎమ్‌యూ 2008 జూన్‌లో మంజూరైంది. |
| ప్రాజెక్టు నిర్వహణ విభాగం (పీఐయూ) | జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ అమలులోని నాణ్యతా ప్రమాణాలను ఇతోధికం చేయటంపై దృష్టి పెడుతూ, పట్టణ స్థానిక సంస్థలకున్న ప్రావీణ్యతనూ పెంపొందించగల నిర్వాహక విభాగం. | మూడు మిషన్ సిటీలకు,[2] ఏడు నాన్-మిషన్ సిటీలకూ[3] కలిపి 10 పీఐయూలు 2008 జూన్‌లో మంజూరయ్యాయి. |

*మూలం: జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ మార్గదర్శకాలు*

## 4.2 ఆడిట్ విధివిధానాలు

### 4.2.1 ఆడిట్ లక్ష్యాలు

ఈ దిగువ అంశాలను ధృవీకరించుకోవటం జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ మీది ఆడిట్ సమీక్ష ముఖ్యలక్ష్యాలు :

- సంస్కరణలకు నిర్దేశించిన కార్యాచరణ కట్టుదిట్టంగా అమలు జరిగిందా;
- వివిధ ప్రాజెక్టులకు ప్రణాళికారచన సక్రమంగా జరిగిందా; వాటిని పొదుపుగానూ, సమర్థవంతంగానూ అమలు జరిపి, ఆశించిన ఫలితాలు సాధించారా;

---

[2] హైదరాబాదు, విశాఖపట్నం, విజయవాడ

[3] విజయనగరం, రాజమండ్రి, గుంటూరు, అనంతపురం, రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్

- నగరాల మౌలిక అభివృద్ధికి అవసరమైన వాటిని సమగ్రంగానూ, సముచితంగానూ అంచనావేసి గుర్తించారా;
- ఆర్థిక నియంత్రణ తగువిధంగా ఉన్నదా;
- పర్యవేక్షణ, మూల్య నిర్ధారణ యంత్రాంగం సముచితంగానూ, కార్యసాధకంగానూ ఉన్నదా.

### 4.2.2 ఆడిట్ ప్రామాణికంగా తీసుకున్న అంశాలు

ఆడిట్ కనుగొన్న విషయాలను ఈ దిగువ పేర్కొన్న వాటిలోని ప్రామాణికాలకు ప్రతిగా నిశ్చయించుకోవటం జరిగింది :

- పథకం మార్గనిర్దేశకాలు, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు, ఉత్తరువులు, టూల్‌కిట్లు;
- కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, పట్టణ స్థానిక సంస్థలు సంతకాలు చేసిన త్రైపాక్షిక ఒప్పంద పత్రం;
- ఎంపిక చేసుకున్న ప్రాజెక్టుల సమగ్ర నివేదికలు;
- ఆంధ్రప్రదేశ్ ఆర్థిక నియమావళి, అప్పుడప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు.

### 4.2.3 ఆడిట్ పరిధి, పద్ధతి

ఆడిట్ 2011 ఏప్రిల్ నుంచి 2012 జూన్ వరకు నిర్వహించి జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పూర్తి కాలవ్యవధి (2005-12) రికార్డులను పరిశీలించటం జరిగింది. జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కింద రాష్ట్రానికి మంజూరైన ₹11,907 కోట్ల విలువైన 251 ప్రాజెక్టుల నుంచి ₹6,352 కోట్ల (53 శాతం) విలువైన 74 ప్రాజెక్టులను (*అనుబంధం - 4.1*) విస్తృత ఆడిట్ పరిశీలనకు ఎంపిక చేసుకోవటం జరిగింది. ఈ ప్రాజెక్టులు 4 మిషన్ సిటీలు,[4] 38 నాన్ - మిషన్ సిటీలకు[5] సంబంధించినవి. అంశాలవారీ వివరాలు ఈ దిగువ ఉన్నాయి.

పట్టిక 4.2

| అంశాలు | మురుగునీటి పారుదల | వరదనీటి కాలవలు | నీటి సరఫరా | మౌలిక వసతులు/ గృహ నిర్మాణం | ఇతరములు | మొత్తం | ఆమోదిత వ్యయం (₹ కోట్లలో) |
|---|---|---|---|---|---|---|---|
| యూఐజీ | 8 | 8 | 10 | 0 | 1 | 27 | 3759.77 |
| బీఎస్‌యూపీ | 0 | 0 | 0 | 4 | 0 | 4 | 1063.67 |
| యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 8 | 9 | 25 | 0 | 0 | 42 | 1473.39 |
| ఐహెచ్ఎస్‌డీపీ | 0 | 0 | 0 | 1 | 0 | 1 | 55.36 |
| మొత్తం | **16** | **17** | **35** | **5** | **1** | **74** | **6352.19** |

ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ అయిన ఏపీయూఎఫ్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌తో 2011 ఏప్రిల్ నెలలో నిర్వహించిన సమీక్షారంభ సమావేశంతో ఈ ఆడిట్ సమీక్ష ప్రారంభమయింది. ఏపీయూఎఫ్ఐడీసీ, సంబంధిత పట్టణాభివృద్ధి సంస్థలు, ఇంకా ప్రాజెక్టు నిర్వాహక సంస్థల[6] రికార్డులను క్షేత్రస్థాయి ఆడిట్‌లో భాగంగా పరిశీలించటం జరిగింది. ఆడిట్ పరిశీలనలకు రూఢిగా అవసరమైన చోట్ల ఛాయాచిత్రాలను సాక్ష్యంగా తీసుకోవటం, ఆడిట్‌లో భాగంగా 20 ప్రాజెక్టులకు సంబంధించిన 1528 మంది లబ్ధిదారులను విచారించటం

---

[4] హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి

[5] అనకాపల్లి, అనంతపురం, బాపట్ల, భువనగిరి, చీరాల, ధర్మవరం, ధోన్, ఏలూరు, కడప, కదిరి, కామారెడ్డి, కందుకూరు, కరీంనగర్, కర్నూలు, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మార్కాపురం, మెదక్, మిర్యాలగూడ, నగరి, నల్గొండ, నంద్యాల, నరసరావుపేట, నారాయణపేట, నిజామాబాద్, ఒంగోలు, పిఠాపురం, ప్రొద్దుటూరు, రాజంపేట, రాయదుర్గం, రామచంద్రా పురం, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, తణుకు, వనపర్తి, వరంగల్, ఎమ్మిగనూరు

[6] హైదరాబాద్ మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి, మునిసిపల్ పాలన మరియు పట్టణాభివృద్ధి శాఖలోని ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం

జరిగింది. ఆడిట్ ఫలితాలను 2013 జనవరిలో నిర్వహించిన సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వంతో చర్చించి, ప్రభుత్వం/ప్రభుత్వ శాఖ వెలిబుచ్చిన అభిప్రాయాలను, రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానాలను తగు విధంగా ఈ నివేదికలో పొందుపరచడం జరిగింది.

### *ఆడిట్‌లో కనుగొన్న అంశాలు*

## 4.3 సంస్కరణల అమలు

### 4.3.1 త్రైపాక్షిక ఒప్పంద పత్రాలు

మూడు మిషన్ సిటీలతో (హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ) త్రైపాక్షిక ఒప్పంద పత్రాలు 2006 మార్చి నెలలో రాసుకోగా, నాలుగవ నగరమైన తిరుపతి[7] విషయంలో 2009లో ఒప్పందం చేసుకున్నారు.

### 4.3.2 రాష్ట్రస్థాయి ఆదేశక సంస్కరణలు

#### *4.3.2.1 నేపథ్యం*

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కింద రాష్ట్ర స్థాయిలో ఈ దిగువ పేర్కొన్న ఆదేశక సంస్కరణలు ఉంటాయి :

- 74వ రాజ్యాంగ సవరణ చట్టంలో సూచించిన విధంగా వికేంద్రీకరణ విధానాలను అమలు చేయటం;
- పట్టణ భూ గరిష్ట పరిమితి చట్టాన్ని రద్దు చేయటం;
- అద్దె నియంత్రణ చట్టాలను రద్దు చేసి, స్థల యజమానులు, కిరాయిదార్ల ప్రయోజనాలను సమదృష్టితో చూడటం ;
- స్టాంపు సుంకాన్ని హేతు బద్ధీకరించి, దీనిని 5 శాతానికి మించకుండా చూడటం;
- ప్రజా వెల్లడి చట్టాన్నొకదాన్ని తీసుకురావటం ద్వారా పట్టణ స్థానిక సంస్థలు, అనుబంధ ప్రభుత్వ సంస్థలకు మధ్యకాలిక ద్రవ్య ప్రణాళికలు రూపొందేలా చూడటం, త్రైమాసిక పురోగతి సమాచారం భాగస్వాములు అందరికి అందే విధంగా చర్యలు తీసుకోవటం;
- ఎన్నికైన పట్టణ స్థానిక పాలక వర్గాలు ఏడు సంవత్సరాల పాటు నగర ప్రణాళికా నిర్వహణలో పాలుపంచుకొనేలా చేసి, పట్టణాలలో పౌరసేవలందిస్తున్న ప్రత్యేక ఏజన్సీలను ఈ స్థానిక సంస్థలకు అనుసంధానం చేసి వారిని జవాబుదారులను చేయటం.
- పౌరుల భూమికను వ్యవస్థీకరించేందుకు సామాజిక భాగస్వామ్య చట్టాన్ని తీసుకొచ్చి పట్టణాలలో ప్రాంతీయ సభల విధానం ప్రవేశపెట్టటం.

ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర స్థాయి ఆదేశక సంస్కరణలను వాస్తవంగా అమలు చేసే విషయంలో ఆడిట్ ఈ దిగువ అంశాలను గమనించింది :

#### *4.3.2.2 వికేంద్రీకరణ విధానాలు*

రాజ్యాంగంలోని పన్నెండవ షెడ్యూలులో పేర్కొన్న 18 విధులను ఈ విధానంలో భాగంగా పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేయవలసి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం 17 విధులను పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేసింది కానీ పట్టణ, గ్రామీణ అవసరాలను కూడా తీరుస్తున్నందున అగ్నిమాపక సేవలను మాత్రం అలా బదిలీ చేయలేదు. ఐతే, బాధ్యతలను వాస్తవంగా అప్పగించే విషయంలోపలు విధుల మధ్య వ్యత్యాసాలున్నాయి. విశేషించి, పట్టణ ప్రణాళిక విషయంలో ఈ తేడాలున్నాయి :

---

[7] తిరుపతిని 2009లో మిషన్ సిటిగా గుర్తించారు

- పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలు ఏర్పడిన నాలుగు మిషన్ సిటీలలో (హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి) పట్టణ ప్రణాళిక కింద బృహత్ ప్రణాళికలు (లేఔట్‌లు, అభివృద్ధి ప్రణాళికలు) ప్రాధికార సంస్థల పరిధిలో ఉన్నాయిగానీ పట్టణ స్థానిక సంస్థల అధీనంలో లేవు.
- ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రాంతాల అభివృద్ధి చట్టం, ఇంకా హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా - మురుగునీటి పారుదల చట్టాలకు 2007 ఆగస్టులో సవరణలు తెచ్చి ఎన్నికైన పట్టణ స్థానిక సంస్థలను పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలు, జలమండలితో అనుసంధానం చేశారు. ఐతే, హైదరాబాద్ జలమండలిలో మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదలకు సంబంధించి మచ్చుకు తనిఖీ చేసిన ఆరు[8] ప్రాజెక్టులలోనూ బృహత్ ప్రణాళికను రూపొందించి అమలు చేసే విషయంలో పట్టణ స్థానిక సంస్థ చురుగ్గా పాల్గొన్న జాడలు లేవు.

పన్నెండవ షెడ్యూలు విధులలో పట్టణ స్థానిక సంస్థలకు లాంఛనంగా బదిలీ అయిన మిగతా అంశాల విషయమై ఆడిట్ గమనించినవి ఈ విధంగా ఉన్నాయి :

| విధులు | పరిస్థితి |
|---|---|
| ఆర్థిక సామాజిక అభివృద్ధి ప్రణాళిక | దీని ప్రకారం అన్ని జిల్లాలలో జిల్లా ప్రణాళికా సంఘాలనూ, హైదరాబాద్‌లో మెట్రోపాలిటన్ ప్రణాళికా సంఘాన్నీ ఏర్పాటు చేయాల్సి ఉంది.<br>హైదరాబాద్ తప్ప అన్ని జిల్లాలలోనూ జిల్లా ప్రణాళికా సంఘాలను ఏర్పరచారు. హైదరాబాద్‌లో మెట్రోపాలిటన్ ప్రణాళికా సంఘం ఏర్పాటుకు తగిన నియమాలను 2009 జనవరిలో రూపొందించారు (ఈ సంఘం ఏర్పాటు కోసం 2007 డిసెంబరులో చేసిన చట్టం ప్రకారం). హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రణాళికా సంఘం 2012 జూన్ నాటికి ఆవిర్భవించలేదు. |
| రహదార్లు, వంతెనలు | పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలు ఉన్న నగరాలలో ఈ బాధ్యతలను స్థానిక సంస్థలతోపాటు ప్రాధికార సంస్థలు కూడా నెరవేరుస్తున్నాయి. |
| గృహ, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు నీటి సరఫరా | హైదరాబాద్‌లో ఈ బాధ్యతలను నగరపాలక సంస్థకాకుండా జలమండలి వహిస్తోంది. |
| నగర అటవీకరణ | పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలు ఉన్న నగరాలలో ఈ బాధ్యతలను ప్రాధికార సంస్థలు, స్థానిక సంస్థలూ కలిసి నిర్వహిస్తున్నాయి. |

### *4.3.2.3 రాష్ట్ర స్థాయి ఇతర సంస్కరణలు*

పట్టణ భూ గరిష్ఠ పరిమితి రద్దు చట్టం, 1999 అమలును 2008 మార్చి 27న చేపట్టారు. అద్దె నియంత్రణ నిబంధనల్లో సంస్కరణలకు సంబంధించి త్రైపాక్షిక ఒప్పందంలో[9], 2007-08 వరకూ కాలక్రమరేఖ నిర్దేశించుకోగా ఆంధ్రప్రదేశ్ అద్దె నియంత్రణ బిల్లు - 2011ని రాష్ట్ర శాసనసభ 2011 డిసెంబరులో ఆమోదించింది. ఐతే, 2012 డిసెంబరు నాటికి రాష్ట్రపతి ఆమోదం రాలేదు. స్టాంపు సుంకం హేతుబద్ధీకరణ విషయానికొస్తే, 2010 ఆగస్టు 1 నుండి సుంకాన్ని 7 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది (2010 జూలై).

---

[8] 1. మూసీనది దక్షిణాన (జోన్-I) పాత బస్తీలో మురుగునీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ, 2. మూసీనది దక్షిణాన (జోన్-II) పాత బస్తీలో మురుగునీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ, 3. శేరిలింగంపల్లి మునిసిపాలిటీలో మురుగునీటి పారుదల బృహత్ ప్రణాళిక అమలు, 4. జీహెచ్ఎమ్‌సీ రాజేంద్ర నగర్ మునిసిపల్ సర్కిల్‌లో గుర్తించిన కొన్ని జోన్లకు సమగ్ర నీటి సరఫరా వ్యవస్థ, మురుగునీటి పారుదల బృహత్ ప్రణాళిక అమలు 5. కృష్ణా తాగునీటి సరఫరా ప్రాజెక్టు రెండవదశ, 6. పాత ఎమ్‌సీహెచ్‌లోని 10 జోన్లలో ఫీడర్ వ్యవస్థ, పంపిణీవ్యవస్థ పునరుద్ధరణ

[9] సంస్కరణల కార్యాచరణ గురించి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, పట్టణ స్థానిక సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం

### ప్రజావెల్లడి చట్టం అమలు

అవసరమైన సమాచారాన్ని తరచుగా ప్రజలకు వెల్లడిచేసేందుకు వీలుకల్పిస్తూ హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ చట్టానికి 2008 ఏప్రిల్ నెలలో ఒక సవరణ చేశారు. ఈ సవరణ వలన రూపొందిన నియమాలను అనుసరించి 24 కీలక అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు వెబ్‌సైట్లు, నోటీసు బోర్డులు, వార్తాపత్రికలు, బహిరంగ ప్రకటనల ద్వారా వెల్లడి చేయాలి. ఐతే, ఇలా సవరించిన చట్టాన్ని అమలు చేసేందుకు తగిన ఆదేశాలను 20 నెలలు గడిచాక 2009 డిసెంబరులో మాత్రమే జారీ చేశారు.

మిషన్ సిటీలు నాలుగింటికి సంబంధించిన వెబ్‌సైట్లను ఆడిట్ పరిశీలించగా కౌన్సిల్ తీర్మానాలు, పన్నుల వసూళ్ళు, బకాయిదారుల జాబితా, ఆర్థిక నివేదికలు, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, మొదలైన విషయాలకు సంబంధించిన సమాచారం ఈ వెబ్‌సైట్లలో లభ్యమవుతున్నది. కానీ, వివిధ సబ్సిడీ పథకాలు, సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల గుర్తింపు, ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రణాళిక-ప్రణాళికేతర గ్రాంట్ల వివరాలుగానీ, 2008 ఏప్రిల్ సవరణలో స్పష్టంగా నిర్దేశించినట్లు వార్షిక పద్దులు గానీ ఈ వెబ్‌సైట్లలో పొందుపరచ లేదు. ఇలా వెబ్‌సైట్లలో చోటుచేసుకోని అంశాల వివరాలు స్థానికసంస్థలవారీగా *అనుబంధం-4.2*లో సూచించడం జరిగింది. ప్రజావెల్లడి చట్టం అనుసరించి పూర్తి సమాచారం వెల్లడించవలసిందిగా అన్ని పట్టణ స్థానిక సంస్థలకూ ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు).

### సమాజ భాగస్వామ్య చట్టం అమలు

హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ చట్టానికి 2008 ఏప్రిల్ నెలలో ఒక సవరణ చేశారు. దీని ప్రకారం మునిసిపాలిటీలలో లక్షలోపు జనాభా గల వార్డులకు వార్డు కమిటీలు (వీటిలో వార్డుకు ప్రాతినిధ్యం వహిస్తూ కౌన్సిల్ సభ్యులు, పౌరసమాజానికి ప్రాతినిధ్యం వహించే నియమిత సభ్యులు, ప్రాంతీయ సభల ప్రతినిధులు (ఉన్నట్లైతే), వార్డు సభ (వార్డులోని ఎలక్టర్లు అందరూ) ఏర్పాటు చేయాలి. అలాగే జనాభా 1000 నుంచి 2000 వరకు ఉన్నచోట్ల ప్రాంతీయ సభలను ఏర్పాటు చేయాలి (ఇందులో ప్రతి ప్రాంతం నుంచి కౌన్సిల్ నామినేట్ చేసిన సభ్యులు పౌరసమాజం ప్రతినిధులుగా ఉంటారు).

చట్ట సంబంధ సవరణలు 2008 ఏప్రిల్ నెలలోనే ఆమోదించినా, వార్డు కమిటీలకు నియమాలను మాత్రం 2010 ఫిబ్రవరిలో జారీ చేశారు.

- జీహెచ్ఎమ్‌సీ (హైదరాబాద్)లో వార్డు కమిటీలు, ప్రాంతీయ సభలు రూపొందించారు.
- విశాఖపట్నం (జీవీఎమ్‌సీ)లో వార్డు కమిటీలను ఏర్పరచారుగానీ ప్రాంతీయ సభలను ఇంకా నియోగించ లేదు[10].
- రాష్ట్రంలోని మిగతా పట్టణ స్థానిక సంస్థలలో 2012 జూన్ నాటికి ఈ కమిటీలను/సభలను రూపొందించ లేదు.

ఎన్నికలు నిర్వహించనందున, ఎన్నికైన పాలక మండలి లేనందున ఇతర స్థానిక సంస్థలలో వార్డు కమిటీలను, ప్రాంతీయ సభలను ఏర్పాటు చేయలేకపోయినట్లు ప్రభుత్వం ప్రత్యుత్తరమిచ్చింది. (2012 డిసెంబరు). నియమాలను రూపొందించేందుకు 22 నెలల జాప్యం జరగటం, నియామాలను జారీ చేసే సమయానికే (2010 ఫిబ్రవరి) ఎన్నికైన పాలకమండళ్ళు పనిచేస్తూండటంతో ఈ సమాధానం ఆమోదయోగ్యంకాదు.

[10] ప్రాంతీయ సభలకు ప్రతి నిధులను నామినేట్ చేసినట్లు 2012 జనవరి 20 తీర్మానంలో పేర్కొన్నారు. ఐతే, ప్రాంతీయ సభలను రూపొందించిన వైనం దస్త్రాలలో కనిపించలేదు

### 4.3.3 పట్టణ స్థానిక సంస్థల స్థాయి ఆదేశక సంస్కరణలు

పట్టణ స్థానిక సంస్థల స్థాయిలో చేపట్టవలసిన ఆదేశక సంస్కరణలు, మిషన్ సిటీలలో వాటి ఆచరణ స్థితి ఈ కింది విధంగా ఉన్నది :

| సంస్కరణ | ఆచరణ స్థితి |
|---|---|
| ఈ - గవర్నెన్స్ వ్యవస్థ | జనన-మరణ నమోదు, ఆస్తిపన్ను మొదలైన వాటి చెల్లింపుల వంటి ప్రధాన సేవల కల్పనకు అవసరమైన వ్యవస్థలను రూపొందించారు. వీటి వలన ప్రజలు ఈ-సేవలాంటి పౌరుగు సేవల ద్వారా పనులు చక్కబెట్టుకోవచ్చును. |
| ఎక్రూవల్ ప్రాతిపదికన జంటపద్దు విధానంలో లెక్కలు రూపొందించటం | నాలుగు మిషన్ సిటీలలోని స్థానిక సంస్థలు తమ పద్దులను ఎక్రూవల్ ప్రాతిపదికన, జంటపద్దు విధానంలో రూపొందిస్తున్నట్లు ఆడిట్‌కు తెలిపాయి. ఈ విధానం విజయవంతంగా అమలు చేస్తున్నట్లు రాష్ట్రస్థాయి నోడల్ ఏజన్సీతోపాటు యూనిట్లు కూడా కేంద్ర ప్రభుత్వానికి నివేదించాయి. ఐతే, ఒక్క జీ హెచ్ఎమ్‌సీ మాత్రమే తమ పద్దులను వాస్తవంగా ఎక్రూవల్ ప్రాతిపదికన, జంటపద్దు విధానంలో రూపొందించినట్లు ఆడిట్ పరిశీలనలో తేలింది. మచ్చుకు తనిఖీ చేసిన మిగతా స్థానిక సంస్థల (జీ వీఎమ్‌సీ, వీఎమ్‌సీ, టీఎమ్‌సీ) ఇటీవలి పద్దులు పరిశీలించగా అవి ఎక్రూవల్ ప్రాతిపదికన, జంటపద్దు విధానంలో రూపొందలేదు. ఈ సంస్కరణను విజయవంతంగా అమలు చేసినట్లుగా పట్టణ స్థానిక సంస్థలు, రాష్ట్ర స్థాయి నోడల్ ఏజెన్సీ కేంద్ర ప్రభుత్వానికి నివేదించినది ఆవిధంగా సరికాదు.<br>రోజువారీ లావాదేవీలను కొత్త విధానంలో కంప్యూటరీకరిస్తున్నారని ప్రభుత్వం బదులిచ్చింది. |
| పట్టణ స్థానిక సంస్థలలో జీఐఎస్ డేటాబేస్ రూపకల్పన | పథకం ప్రారంభమైన తొలి నాలుగు సంవత్సరాలలోనే ఈ సంస్కరణ చేపడతామని పట్టణ స్థానిక సంస్థలు చెప్పాయి. ఐతే, మచ్చుకు తనిఖీ చేసిన సంస్థలలో ఎక్కడా ఈ విధానం అమలు కాలేదు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలలో జీఐఎస్ సర్వే/డేటాబేస్ పని ఇంకా కొనసాగుతున్నది. తిరుపతిలో అసలు మొదలుకాలేదు.<br>జీవీఎమ్‌సీలో జీఐఎస్ రూపొందించారని చెబుతూ, జీహెచ్ఎమ్‌సీ, వీఎమ్‌సీ, టీఎమ్‌సీలలో ఇంకా పూర్తవలేదని ప్రభుత్వం అంగీకరించింది (2012 డిసెంబరు). |
| ఆస్తి పన్ను (85 శాతం విస్తృతి, 90 శాతం వసూలు దక్షత) | ఆస్తి పన్ను విస్తరణ 80 శాతానికి పైగా సాధించినట్లు అన్ని పట్టణ స్థానిక సంస్థలు నివేదించాయి (*జీహెచ్ఎమ్‌సీ - 85 శాతం; జీవీఎమ్‌సీ - 90 శాతం; వీఎమ్‌సీ - 89 శాతం; టీఎమ్‌సీ - 100 శాతం*). ఐతే, జీ ఐఎస్ డేటాబేస్ లేని నేపథ్యంలో ఈ నివేదికలలోని విశ్వశనీయత నిర్ధారించుకోలేము.<br>డీసీబీ రిజిస్టరు (వసూలు కావలసినవి, వసూలైనవి, బకాయిలు) చూడగా ఒక్క వీఎమ్‌సీ (97 శాతం) మినహా మిగతా మూడు స్థానిక సంస్థలలో 90 శాతంపైన ఆస్తిపన్ను వసూలు చేయలేదని తెలిసింది. |
| నూరు శాతం ఖర్చుల వసూలు (నీటి సరఫరా, ఘనవ్యర్థాల నిర్వహణ) | జీవీఎమ్‌సీ మాత్రమే నీటి సరఫరా విషయంలో నూరు శాతం ఖర్చులు రాబడుతున్నది.<br>ఈ స్థానిక సంస్థలు ఘన వ్యర్థాల నిర్వహణ వ్యయం నూరు శాతం వసూలు చేయలేకపోయాయి. |
| పట్టణ పేదలకు ప్రాథమిక వసతుల కోసం నిధుల అంతర్గత కేటాయింపు | మిషన్ సిటీలు అన్నీ తమ బడ్జెట్‌లలో నిర్దేశిత 40 శాతం నిధులను పట్టణ పేదలకు వసతులు కల్పించటంకోసం ప్రత్యేకిస్తున్నట్లు ఆడిట్ గమనించింది. |

### 4.3.4 ఐచ్ఛిక సంస్కరణలు

నిర్మాణ నిబంధనలను సవరించటం, గృహనిర్మాణ ప్రాజెక్టులన్నింటిలోనూ అభివృద్ధి పరచిన స్థలంలో 20-25 శాతం ఆర్థికంగా బలహీన వర్గాలకు, స్వల్పాదాయ వర్గాలకు ప్రత్యేకించటం, వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు మార్పిడి చేసేందుకు న్యాయసంబంధ, విధానసంబంధ కార్యరీతులను సరళీకరించటం, ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్య విధానాలను ప్రోత్సహించటం వంటి ఐచ్ఛిక సంస్కరణలలో రాష్ట్ర ప్రభుత్వం సముచితమైన చర్యలను ఆరంభించినట్లు ఆడిట్ గమనించింది.

## 4.4 ప్రణాళిక, సన్నాహక చర్యలు

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కింద ప్రణాళికలో ఈ దిగువ అంశాలు ఇమిడి ఉన్నాయి :

**(i)** విధాన విషయాలు, కార్యాచరణ, వ్యూహరచన, ఆర్థిక వెసులుబాటులను స్పష్టం చేస్తూ ***నగరాభివృద్ధి ప్రణాళికలను*** రూపొందించి, వీటికి సమయానుకూలంగా మెరుగులు దిద్దుతూ సదా సజీవంగా ఉండేలా చూడటం.

రాష్ట్రంలోని నాలుగు మిషన్ సిటీలలోనూ స్థానిక సంస్థలు ఈ ప్రణాళికలను రూపొందించి కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందినట్లు ఆడిట్ పరిశీలనలో తెలిసింది.

**(ii)** ఎంపిక చేసిన వర్గాలలలోని ప్రాజెక్టులకు వాటి జీవన వర్తుల వ్యయం అభిలషణీయ స్థాయిలో ఉండే విధంగా ***సమగ్ర ప్రాజెక్టు నివేదికలు రూపొందించటం***.

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కింద చేపట్టిన అన్ని ప్రాజెక్టులకు సమగ్ర నివేదికలు రూపొందించారు. ఐతే, సమగ్ర ప్రాజెక్టు నివేదికల రూపకల్పనకోసం పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఉపకరణ పత్రాలను (టూల్ కిట్స్) రూపొందించగా వివాదరహిత స్థల సేకరణ, అవరోధాల తరలింపు, వివిధ సంస్థల నుంచి పొందవలసిన అనుమతులు, చేపట్టవలసిన సర్వే-పరిశోధనలు, టెండర్లు పిలవటం, నీటి వనరులను గుర్తించటంతోపాటు ఈ ప్రక్రియలన్నిటికీ కాలపరిమితులను నిర్ణయించటంలో ఈ టూల్ కిట్లను అనుసరించలేదని ఆడిట్ గమనించింది.

**(iii)** రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీకి తగు సాంకేతిక, నిర్వాహక ఆలంబనం ఒనగూర్చేందుకోసం ***కార్యక్రమ నిర్వహణ విభాగం*** ఏర్పాటు చేయటం.

ఈ విభాగాన్ని కేంద్ర ప్రభుత్వం 2008 జూన్‌లో మంజూరు చేయగా, నవంబరులో ఇది ఏర్పడింది. అప్పటికే నాలుగు మిషన్ సిటీలకూ నగరాభివృద్ధి ప్రణాళికలు కేంద్ర ప్రభుత్వ ఆమోదంపొందాయని ఆడిట్ గమనించింది. జేఎన్ఎన్‌యూఆర్ఎమ్‌లో చేర్చిన పలు ప్రాజెక్టులు చాలా కాలం క్రితం అనుకున్నవేనని, సమగ్ర ప్రాజెక్టు నివేదికలు ఎంతో ముందే రూపొందించటంచేత కార్యక్రమ నిర్వహణ విభాగం ఏర్పడేవరకూ వేచిచూడకుండా వీటిని కేంద్రానికి పంపామని ప్రభుత్వం సమీక్షానంతర సమావేశంలో (2013 జనవరి) పేర్కొంది. కార్యక్రమాల నిర్వహణ, పర్యవేక్షణ ఈ విభాగం దృష్టి సారించవలసిన అంశాలలో ముఖ్యమైనవి. ఐతే, ఈ విభాగంలోని కార్యక్రమ పర్యవేక్షణ, మూల్యాంకన వ్యవస్థ 2012 జూన్ నాటికి పూర్తి స్థాయిలో క్రియాశీలం కాలేదని నోడల్ ఏజన్సీ కూడా అంగీకరించింది. ప్రాజెక్టులవారీగా సమగ్ర సమాచారం ఈ పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా నోడల్ ఏజన్సీ వెబ్‌సైట్‌లో లభ్యం కాలేదు.

**(iv)** పట్టణ స్థానిక సంస్థల నైపుణ్యం పెంపొందించేందుకు, ఇతోధికం చేసేందుకుగాను నిర్వహణ విభాగాలుగా ***ప్రాజెక్టు అమలు యూనిట్లను*** నెలకొల్పాలి.

మూడు మిషన్ సిటీలు,[11] ఏడు నాన్‌మిషన్ సిటీల[12] కోసం 10 యూనిట్లను 2008 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ వెబ్‌సైట్‌లో పొందుపరచగా, విజయవాడలో ప్రాజెక్టు అమలు యూనిట్‌ను నెలకొల్పలేదని ఆడిట్ మచ్చుకు తనిఖీ చేసినప్పుడు వెల్లడైంది. ప్రాజెక్టు అమలు యూనిట్ల విధులను ఆయా పట్టణ స్థానిక సంస్థల ఇంజినీర్లు, ఇతర సిబ్బంది నిర్వహిస్తున్నారని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు). ఐతే, స్థలసేకరణ చేపట్టకపోవటం, రైల్వే అధికారులనుంచి అనుమతులు సాధించకపోవటం వంటి కారణాల వలన పలు ప్రాజెక్టులు ఆలశ్యమయ్యాయి. ప్రాజెక్టు అమలు యూనిట్లు కట్టుదిట్టంగా రంగంలోకి దిగి ఉంటే ఈ సమస్యలను పరిష్కరించగలిగేవి. ఈ యూనిట్లకు నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరక పోవటం వలన ప్రభుత్వ సమాధానం ఆమోదయోగ్యం కాదు.

## 4.5 ఆర్థిక నిర్వహణ

### 4.5.1 నిధుల విడుదల, వ్యయం

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కింద ఆమోదించిన 251 ప్రాజెక్టులకు 2012 మార్చి చివరి నాటికి విడుదలైన నిధులు, చేసిన వ్యయం రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ లెక్కల ప్రకారం ఈ కింది విధంగా ఉన్నాయి.

పట్టిక 4.3

(₹ కోట్లలో)

| అంశం | ప్రాజెక్టుల సంఖ్య | ఆమోదిత ప్రాజెక్టు వ్యయం | విడుదల చేసినది | వ్యయం |
|---|---|---|---|---|
| యూఐజీ | 54 | 5238 | 1971* | 3451 |
| బీఎస్‌యూపీ | 36 | 3012 | 1422* | 2273 |
| యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 84 | 2460 | 2272 | 2194 |
| ఐహెచ్ఎస్‌డీపి | 77 | 1197 | 613 | 678 |
| **మొత్తం** | **251** | **11907** | **6278** | **8596** |

*ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు ఉన్నాయి. పట్టణ స్థానిక సంస్థల వాటా ఇందులోలేదు

ప్రాజెక్టు ఖర్చులకు వేరుగా పద్దులు లేకపోవటంతో పైన పేర్కొన్న వ్యయంలోని విశ్వసనీయతను ఆడిట్ ధృవపరచుకొనలేక పోయింది.

### 4.5.2 నిధుల మళ్ళింపు

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ నిధులను ఇతర అవసరాలకు మరలించటం, ఈ పథకంలోలేని అంశాలమీద ఖర్చులు చేయటం వంటి పలు విషయాలు ఆడిట్ గమనించింది. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి :

- హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మురునీటి పారుదల మండలి (జలమండలి) 2008 డిసెంబరు, 2009 జూన్ నెలల మధ్య ₹78.38 కోట్ల మేర గోదావరి నీటి సరఫరా పథకం తొలి దశ బిల్లులు చెల్లించటంకోసం మళ్ళించింది. ఇది జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పథకంలో భాగం కాదు. అదే విధంగా, ₹2.86 కోట్ల జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ నిధులు కోదండపూర్, నసర్లపల్లి, గొడకొండ్ల మొదటి దశ నిర్వహణ పనులకోసం చెల్లించారు. ఇలా మళ్ళించిన నిధులను తిరిగి భర్తీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది (2012 డిసెంబరు).

[11] హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ

[12] విజయనగరం, రాజమండ్రి, గుంటూరు, అనంతపురం, రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్

- అదే విధంగా, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ₹4.63 కోట్లను పట్టణ పేదల గృహ నిర్మాణాలు/ఇందిరమ్మ ఇళ్ళకు మళ్ళించి ఇనుము, సిమెంటు ధరల పెరుగుదల గురించి ₹7.72 కోట్లు చెల్లించారు. ఇలా మరలించిన సొమ్ము తిరిగి భర్తీ చేసేందుకు అదనపు నిధులకోసం రాష్ట్ర ప్రభుత్వానికి మనవి చేస్తామని కమిషనర్ తెలిపారు (2012 డిసెంబరు).

### 4.5.3 ఇతర ఆర్థిక అతిక్రమణలు

- నాలుగు ప్రాజెక్టులలో[13] సెంట్రల్ ఎక్సైజ్ (కేంద్ర సుంకం) రాయితీ మొత్తం ₹10.17 కోట్లు గుత్తేదారులకు అనవసరంగా చెల్లించారు. విశాఖపట్నం మహానగరపాలక సంస్థ రెండు ప్రాజెక్టులలో[14] ఇలా అధికంగా చెల్లించిన మొత్తాలను తిరిగి వసూలు చేస్తామని చెప్పింది (2012 డిసెంబరు). గాజువాకకు నీటి సరఫరా ప్రాజెక్టు విషయంలోనైతే వాడుకలో ఉన్న నియమాల మేరకే చెల్లింపులు చేశామని చెప్పారు (2012 డిసెంబరు). ఐతే, జిల్లా కలెక్టర్ సుంకం చెల్లింపు రాయితీ ధృవపత్రాన్ని ఇచ్చిన నేపథ్యంలో ఈ సమాధానం సమ్మతంకాదు. *వరంగల్ నీటి సరఫరా పథకానికి* సంబంధించి, ఎమ్‌ఎస్ పైపుల రేట్లలో కేంద్ర సుంకం కలపకుండానే ఐబీఎమ్ రూపొందించారని సమాధానమిచ్చారు (2012 డిసెంబరు). ఐతే, ఐబీఎమ్ ప్రకారం ఎమ్‌ఎస్ పైపుల ధరలలో అన్ని పన్నులు, సుంకాలు కలిసి ఉంటాయి కాబట్టి ఈ సమాధానం సరికాదు.
- ఎక్సైజ్ సుంకాన్ని 16.48 శాతం నుంచి 14.42 శాతానికి తగ్గించటం వలన '*కర్నూలు నీటి సరఫరా పథకంలో*' కేంద్ర సుంకం ₹21 లక్షలు అదనంగా చెల్లించినట్లు తెలిసింది. ఈ మొత్తాన్ని తరువాతి బిల్లుల నుంచి రాబడతామని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).
- రెండు ప్రాజెక్టులకు[15] సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో ₹1.42 కోట్లమేర సేవాపన్ను, విలువ ఆధారితపన్ను అసలు వసూలు చేయకపోవటం జరిగింది. ఈ మొత్తాలను వసూలు చేస్తామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు).
- రెండు మురుగునీటి ప్రాజెక్టులు, ఒక మంచినీటి సరఫరా ప్రాజెక్టుకు సంబంధించిన బిల్లులనుంచి వసూలు చేసిన (2006 నవంబరు - 2012 మార్చి) సీనరేజీ ఛార్జీలు ₹1.27 కోట్లు, ఎన్ఏసీ ఛార్జీలు ₹35.54 లక్షలను విజయవాడ నగరపాలక సంస్థ ఇంకా ప్రభుత్వానికి/ఎన్ఏసీకి జమ చేయవలసి ఉంది. ప్రణాళికేతర గ్రాంటు వచ్చిన తర్వాత వీటిని చెల్లిస్తామని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). ఐతే, చార్జీలు ఇదివరకే వసూలు చేశారు కాబట్టి వాటిని ప్రభుత్వానికి జమచేయటాన్ని ప్రభుత్వం నుంచి రావలసిన గ్రాంట్లతో ముడిపెట్టటం సరికాదు.
- *గాజువాక ప్రాంతానికి నీటి సరఫరా* ప్రాజెక్టులో 2,68,690.60 ఘ.మీ. మట్టి తవ్వకానికిగానూ సీనరేజి ఛార్జీల రూపేణా అంచనాలలో పొందుపరచిన ₹53.79 లక్షలను బిల్లుల నుంచి వసూలు చేయకపోవటంతో గుత్తేదారుకు అదనపు చెల్లింపు చేసినట్లైంది. వీటిని కూడా త్వరలో వసూలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది (2012 డిసెంబరు).

[13] వరంగల్ నీటి సరఫరా (₹5.51కోట్లు), జీవీఎమ్‌సీ పరిసర 32 ప్రాంతాలకు తాగునీటి సరఫా (₹3.38 కోట్లు), తాటిపూడి జలాశయం నుంచి నగర జలాశయం, పంపింగ్ యూనిట్ల వరకు గల తాటిపూడి పైపులైను మార్చడం (₹1.04 కోట్లు), గాజువాక నీటి సరఫరా (₹24.24 లక్షలు)

[14] జీవీఎమ్‌సీ పరిసర 32 ప్రాంతాలకు తాగునీటి సరఫరా, తాటిపూడి జలాశయం నుంచి నగర జలాశయం, పంపింగ్ యూనిట్ల వరకు గల తాటిపూడి పైపులైను మార్చడం

[15] విశాఖపట్నం మహానగరం జోన్ VIIIలో వరదనీటి కాలువల మెరుగుదల పనులకు ₹1.29 కోట్లు, తాటిపూడి జలాశయంనుంచి నగరంలోని జలాశానికి పైపులైను మార్చిడి పనులు, పంపింగ్ యూనిట్లకు ₹12.79 లక్షలు

- నీటి సరఫరా ప్రాజెక్టులు రెండింటిలో[16] పనులను తొలుత అప్పగించిన గుత్తేదారులు పనుల్లోని మైలు రాళ్ళను అందుకొనలేకపోవటంతో ఒప్పందాలను రద్దు చేసి మిగతా పనులను వేరే వారికి అప్పగించారు. దీనివలన కలిగిన అదనపు వ్యయం (₹1.78 కోట్లు) తొలి విడత గుత్తేదారుల నుంచి వసూలు చేయవలసి ఉంది. బ్యాంకు పూచీని సొమ్ముచేసుకొనటం ద్వారా ₹76.53 లక్షలు వసూలు చేశామనీ, మిగతా మొత్తం రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేస్తామనీ ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు).

- *కృష్ణా తాగునీటి సరఫరా ప్రాజెక్టు (రెండవదశ)* పనులకు సంబంధించి రవాణారేటు/తవ్వకం రేట్లలో లోడింగ్ ఛార్జీలను చేర్చటం వలన గుత్తేదారులకు ₹1.37 కోట్లమేర అధిక చెల్లింపులు జరిగాయి. ఈ మొత్తాలను కూడా వసూలు చేస్తామని ప్రభుత్వం తెలియచేసింది (2012 డిసెంబరు).

- *విశాఖపట్నం మహానగరం జోన్ VIIIలో వరదనీటి కాలువల విస్తరణ పనులకు (గంగుల హెడ్డు, ఎర్రిగడ్డ బ్రాంచి కాలువలకు)* ప్యాకేజీ - IIలో రబ్బిస సరఫరాకు అధిక రేట్లలో చేసిన అదనపు చెల్లింపు ₹4.81 లక్షలు, సీనరేజీ ఛార్జీలను సవరించిన రేటున వసూలు చేయకపోవటం వలన ₹4.08 లక్షలు, మట్టి కుప్పల తరలింపుకు ₹41.08 లక్షల మేర అధిక చెల్లింపులు జరిగాయి. వీటిని వసూలు చేస్తామని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

- *కదిరి నీటి సరఫరా విస్తరణ పథకంలో* ధరల సర్దుబాటును లెక్కగడుతున్నప్పుడు ప్రభుత్వ శాఖ పోత ఇనుముకు రేటును ఎస్ఎస్ఆర్ 2007-08 అనుసరించి టన్నుకు ₹20,000 బదులు ₹15,250 (2008 నవంబరులో తెలియచేసినది) వేయటం వలన గుత్తేదారుకు ₹3.09 కోట్ల అధిక చెల్లింపు జరిగింది. నీటి సరఫరా పథకాలకు ఉపయోగించే పైపులు, అమరికలను మెత్తని ఇనుముతో ఐ.ఎస్. నెం. 8329 ప్రకారమూ, పోత ఇనుముతో 1536 ప్రకారమూ ఉత్పత్తి చేస్తారని ప్రభుత్వం తన సమాధానంలో పేర్కొంది (2012 డిసెంబరు). ఈ గొట్టాలకు వాడే ముడిసరుకు ధరను ఎస్ఎస్ఆర్ 2007-08లో పొందుపరచక పోవటం వలన, భారత ప్రభుత్వ యాజమాన్య సంస్థ అయిన కుద్రేముఖ్ ఐరన్ ఓర్ లిమిటెడ్ (బెంగళూరు) చెప్పిన ₹15,250 ధరనే తీసుకున్నామనీ, ఈ విషయమే ఇంజినీర్-ఇన్-చీఫ్ (ప్రజారోగ్యం) 2008 నవంబరులో తెలియపరచారనీ తెలిపింది. ఐతే, మెత్తని ఇనుము, పోత ఇనుముతో తయారైన గొట్టాలకు ఎస్ఎస్ఆర్ 2008-09 ప్రకారం ఒకేధర వర్తించటం, ఇంకా కుద్రేముఖ్ ఐరన్ ఓర్ లిమిటెడ్ నుంచి వచ్చిన లేఖలో రేట్లు ఏ తరహా ఇనుముకి వర్తించేదీ పేర్కొనకపోవటం వలన పై సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 4.5.4 వసూలు కాని/సర్దుబాటుకాని అడ్వాన్సులు

ఉద్యోగులకు వివిధ అవసరాలకు ఇచ్చిన అడ్వాన్సులు నెలలోపు తిరిగి వసూలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ కోడ్ (మొదటి సంపుటి) నిర్దేశిస్తోంది.

విజయవాడలో అమలవుతున్న బీఎస్‌యూపీ ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ రికార్డులు పరిశీలించగా, వివిధ పనుల నిర్వహణకోసం ఉద్యోగులకు, ఏజన్సీలకు ఏపీఎస్‌హెచ్‌సీఎల్ 2009 జనవరి నుంచి 2011 మే నెల వరకూ మొత్తం ₹3.83 కోట్లను అడ్వాన్సుగా చెల్లించింది. వీటిలో ₹3.09 కోట్లు మాత్రమే సర్దుబాటు అవగా ఇంకా ₹74 లక్షలు వసూలు/సర్దుబాటు కావలసి ఉంది. ప్రభుత్వం 2012 డిసెంబరులో తన సమాధానంలో పేర్కొన్న వసూళ్ళ వివరాలు ఆడిట్ ప్రస్తావించిన అంశాలకు సంబంధించినవి కావు.

---

[16] కందుకూరు, మార్కాపురం నీటి సరఫరా పథకాలు

### 4.5.5 రివాల్వింగ్ ఫండ్ నిర్వహణ

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ నిబంధనల ప్రకారం ఒక రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలి. ఈ పథకం ముగిసే నాటికి అది రాష్ట్ర పట్టణ మౌలిక వసతుల నిధి అవుతుంది.

- యూఐజీ/యుఐడీఎస్ఎస్ఎమ్‌టీ కోసం రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ పట్టణ స్థానిక సంస్థలకు ఇతర సంస్థలకు గ్రాంట్లు, ఋణాలు ఇవ్వాలి. కేంద్ర, రాష్ట్ర గ్రాంట్లలో 25 శాతం మొత్తాన్ని పక్కనపెట్టి ఒక రివాల్వింగ్ ఫండ్‌కు జమ చేయాలి. మౌలిక ప్రాజెక్టుల కోసం మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే విధంగా ఇది ఉండాలి;

- రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ బీఎస్‌యూపీ అమలు సంస్థలకు మృదుల ఋణాలు, గ్రాంట్లు ఇచ్చే సమయంలో కేంద్ర, రాష్ట్ర నిధుల నుంచి కనీసం 10 శాతం వసూలు చేసి ఒక రివాల్వింగ్ ఫండ్‌కు జమచేసి బీఎస్‌యూపీ కింద సమకూర్చుకున్న ఆస్తుల నిర్వహణకు వినియోగించేలా చూడాలి.

ప్రభుత్వం 2006 జూలై నెలలో యూఐజీ/యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ కోసం ఒక రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పరచింది. పట్టణ స్థానిక సంస్థలకు ఇచ్చిన ఋణాలమీద వడ్డీరూపేణా ₹6.37 కోట్లు (₹64.90 కోట్లకుగాను) వసూలు చేసి ఫండుకు జమ చేసింది. మిగతా ₹58.53 కోట్లను 2012 మార్చి నాటికి ఇంకా వసూలు చేయవలసి ఉంది. వడ్డీ చెల్లించమని సంబంధిత పట్టణ స్థానిక సంస్థలకు నోటీసులు ఇచ్చామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు).

ఋణాలను గ్రాంట్లుగా మార్చి ప్రభుత్వం 2009 సెప్టెంబరులో పట్టణ స్థానిక సంస్థలను ఋణ విముక్తులను చేయటం వలన బీఎస్‌యూపీ/ఐహెచ్ఎస్‌డీపీ ప్రాజెక్టుల కోసం రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేయనేలేదు. ఈ ప్రాజెక్టులకు రివాల్వింగ్ ఫండ్ లేకపోవటంతో నోడల్ ఏజన్సీగానీ పట్టణ స్థానిక సంస్థలుగానీ తాము సమకూర్చిన సంపదల పటిష్ట నిర్వహణ కోసం దీర్ఘకాలిక యోచనలేవీ చేయలేదు. సామాజిక నిర్మాణాలను ఆయా పట్టణ స్థానిక సంస్థలు తమ సొంత వనరులతోనే పదిలపరచుకుంటాయని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు).

## 4.6 టెండర్ ప్రక్రియ

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కోడ్ (డీకోడ్) ప్రకారం ₹20,000 పైబడిన పనులకు జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ మార్గదర్శకాలలోనూ, 2003లో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలలోనూ టెండర్ ప్రక్రియ మీద పలు సూచనలు చేశారు. టెండర్లను పిలవటం, పనులను అప్పగించటంలోనే కాక ₹2 కోట్లు, ఆపైన టెండర్లను ఖరారు చేసేందుకు సాంకేతిక, ధరల బిడ్లతో పాటుగా టెండర్ల కమీషనర్‌కు నివేదించటం, సంప్రతింపులను ఏస్థాయిలోనూ అనుమతించకపోవటం, టెండరు ప్రీమియంపై 5 శాతం పరిమితి, రెండవ పిలుపుకు కూడా ప్రీమియం 5 శాతం మించినప్పుడు ప్రభుత్వానికి నివేదించి తాజాగా టెండర్లు పిలవటంకానీ, గుత్తేదారుల పనితీరు ఆధారంగా ప్రభుత్వ శాఖ రూపొందించుకున్న జాబితానుంచి పేరొందిన ఒక గుత్తేదారుకు నామినేషన్‌పై పని అప్పగించేందుకు ఒక కమిటీని నియమించటం మొదలైన విధివిధానాలను వీటిలో పొందుపరిచారు.

ముఖ్యమైన టెండర్లనూ, ఒప్పందాలనూ ఆడిట్ పరిశీలించగా ఈ దిగువ విషయాలు తెలిశాయి :

### 4.6.1 కృష్ణా తాగునీటి సరఫరా పథకం (రెండవ దశ)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో నీటి సరఫరాను మెరుగు పరచేందుకు కృష్ణా నది నుంచి 16.5 టీఎమ్‌సీల[17] నీటిని (270 ఎమ్‌జీ డీ[18] తో సమానం) గ్రహించటం కోసం కృష్ణా తాగునీటి సరఫరా పథకం తలపెట్టారు. ఒక్కొక్క దశలోనూ 90 ఎమ్‌జీడీ చొప్పున మూడు దశలలో ఈ ప్రాజెక్టును నిర్మించతలచారు. తొలి దశ 2002-2005 సంవత్సరాలలో పూర్తి చేసుకుని 2005 ఏప్రిల్ నెలలో వినియోగంలోకి వచ్చింది.

టెండర్ దస్త్రాల కోసం ఆడిట్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా, 2013 జనవరిలో జరిగిన సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం ఆదేశించినాగానీ హైదరాబాద్ మహానగర నీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ దస్త్రాలను పరిశీలన కోసం ఆడిట్ ముందుంచనే లేదు. టెండర్ కమిటీ నిర్ణయ వివరాలు (మినిట్స్), ప్రతిపాదనల నిర్ధారణ (ఎస్సెస్‌మెంట్ ఆఫ్ ఆఫర్స్), ఆమోదపత్రాలు (లెటర్ ఆఫ్ యక్సెప్టెన్స్), ఒప్పందాలు జతపరచిన కాగితాలవంటి పరిమిత దస్త్రాలను పరిశీలించగా, విజయవంతమైన మూడు శ్రేణుల మధ్య ఒక అవగాహన కుదిరే అవకాశం కాదనలేమని ఆడిట్ భావించింది. ఒక వేలందారు (ఎస్సార్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్), వేలం ప్రక్రియలో పోటీని బహుశ తీవ్రతరం చేశారేమో, సాంకేతికంగా అనర్హులయ్యారు. ఆ విధంగా మొత్తం నాలుగు పనులకూ వారి ఫినాన్షియల్ బిడ్లను తెరవలేదు.

### 4.6.2 పనులను విభజించటం

ప్రాజెక్టు సమగ్ర నివేదికకు సంబంధించిన టూల్‌కిట్ల ప్రకారం ప్రాజెక్టులలోని ప్యాకేజీల సంఖ్య పరిమితంగానే ఉండాలి. ఐతే, మొత్తం ₹939.61 కోట్ల ఆమోదిత విలువకల ఆరు ప్రాజెక్టులను[19] (2 మురుగునీటి పారుదల, 1 నీటి సరఫరా, 3 గృహనిర్మాణ) 15 నుంచి 200 వరకు వివిధ ప్యాకేజీలు, పనులుగా విడగొట్టారు. ఇందుకు తగిన కారణాలను పేర్కొనలేదు. ప్రభుత్వ అనుమతి సైతం పొందలేదు. ఇదిసరికాదు. ఇందులో ఒకే తరహా పనికి వేరువేరు ధరలను వర్తింపచేసే ప్రమాదముంది. తొలి టెండర్లకు స్పందన కొరవడటంతో పనులను ఇలా విడగొట్టవలసి వచ్చిందని ప్రభుత్వం సమర్థించుకుంది(2012 డిసెంబరు). నిధుల కొరత, స్థల సేకరణ లోపం వంటి సమస్యలతో ఈ ప్రాజెక్టు సతమతమవుతున్నందున ఇలా పనులను విభజించి అప్పగించటంవలన లక్షిత ప్రయోజనం నెరవేరదు. ఆ విధంగా ప్రభుత్వ సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 4.6.3 పనులప్పగించటం

#### *4.6.3.1 సింగిల్ టెండర్లను ఆమోదించటం*

మంచినీటి సరఫరా వరదనీటి కాలువలు, మురుగునీటి కాలువలకు సంబంధించిన ఐదు ప్రాజెక్టుల[20] కింద 13 పనులను ఆయా ప్రాజెక్టుల అమలు సంస్థలు సింగిల్ టెండరర్లకు అప్పగించారు. ఈ పనుల మొత్తం విలువ ₹18.44 కోట్లు. మొదటి పిలుపులోనే ఈ విధంగా అప్పగించారు. వీటిలో '*కనకదుర్గా కాలనీలో మురుగు సేకరణ*

[17] టీఎమ్‌సీ : శతకోటి ఘనపుటడుగులు;

[18] ఎమ్‌జీడీ : రోజుకి పదిలక్షల గాలన్లు

[19] విజయవాడలో భూగర్భ డ్రైనేజీ లేని చోట్ల ఏర్పాటు చేసేందుకు ₹56.56 కోట్లు; విజయవాడ ఉత్తర భాగంలో మురుగునీటి పారుదల వసతుల కోసం ₹178.15 కోట్లు; విజయవాడలో నీటి సరఫరా లేని చోట్ల ఏర్పాటు కోసం ₹35.48 కోట్లు; హైదరాబాద్ సమీకృత గృహనిర్మాణ, మౌలిక వసతుల అభివృద్ధి పథకం (49,000 ఇళ్ళకు) ₹490 కోట్లు; హైదరాబాద్‌లో 4550 ఇళ్ళు నిర్మించి, వసతులు కల్పించేందుకు ₹124.06 కోట్లు; తిరుపతిలో 4087 ఇళ్ళు నిర్మించి వసతులు కల్పించేందుకు (ఐహెచ్‌ఎస్‌డీపీ) ₹55.36 కోట్లు

[20] విజయవాడలో భూగర్భ డ్రైనేజీ లేనిచోట్ల ఆ సదుపాయం ఏర్పాటు చేసేందుకు, 5 పనులకు ₹11.24 కోట్లు; విజయవాడ ఉత్తర భాగంలో మురుగునీటి పారుదల కోసం, 1 పనికి ₹4.10 కోట్లు; బల్కాపూర్ నాలా (₹17.98 లక్షలు), కూకట్‌పల్లి, బేగంపేట నాలా, పనికి ₹14.69 లక్షలు; విజయవాడలో నీటి సరఫరా వసతులులేని చోట్ల అవి కల్పించటానికి, 5 పనులను ₹2.77 కోట్లు

వ్యవస్థ' కూడా ఉన్నది. దీని అంచనా విలువ ₹4.02 కోట్లు కాగా, ఇందులో ప్రీమియం (9.97 శాతం) కూడా 5 శాతం పరిమితిని మించింది. ***జక్కంపూడి దగ్గర 20 ఎమ్ఎల్‌డీ ఎస్‌టీపీ నిర్మాణ పనులను*** ₹12.95 కోట్ల అంచనా వ్యయంతో నాలుగవ పిలుపులో సింగిల్ టెండరర్‌కు అప్పగించారు. ఇక్కడ కూడా ప్రీమియం 5 శాతం పరిమితిని దాటింది (6.10 శాతం). అదేవిధంగా హైదరాబాద్‌లో వరదనీటి కాలువలకు సంబంధించి మొత్తం ₹1.48 కోట్ల విలువైన 8 పనులను[21] రెండవ పిలుపులో సింగిల్ టెండరర్‌కు అప్పగించారు.

విజయవాడలో రెండు మురుగునీటి పారుదల ప్రాజెక్టులకు ఈపీసీ విధానంలో తొలుత ఇచ్చిన టెండరు ప్రకటనకు స్పందన లేదని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు). హైదరాబాదులో వరదనీటి కాలువ పనులు ఎనిమిదింటికీ తొలి పిలుపుకు స్పందన లేనందున, నిర్మాణ వ్యవధిని సవరించి, సింగిల్ టెండరర్‌కు అప్పగించినట్లు తెలిపారు. విజయవాడలో నీటి సరఫరా ప్రాజెక్టు టెండరు 5 శాతం కన్నా తక్కువగా ఉండటాన్ని పరిగణించి, పథకం గడువులోగా పూర్తి చేసేందుకు వీలుగా సింగిల్ టెండరర్‌కు అప్పగించినట్లు చెప్పారు. ఈ కింది కారణాల వలన ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు.

**(i)** పైనపేర్కొన్న పనులను అప్పగించేముందు ప్రభుత్వ ఆమోదం పొందలేదు. పరిమితిని మించిన ప్రీమియంతో పనులను అప్పగించిన రెండు ప్రాజెక్టులలోను నియమాల ప్రకారం ప్రభుత్వానికి నివేదించి ఉండాల్సింది.

**(ii)** తొలి పిలుపులో, ప్రీమియం 5 శాతానికి లోబడి, సింగిల్ టెండరర్‌కు అప్పగించేందుకు ప్రత్యేక ఆదేశాలు, వెసులుబాటు లేవు. పనులను ఈ విధంగా అప్పగించటంవలన పోటీధరలోని ప్రయోజనాలను కోల్పోయే ప్రమాదముంది.

### *4.6.3.2 పనులను నామినేషన్‌పై అప్పగించటం*

పనులను టెండరు విధానంలోనే అప్పగించాలని స్పష్టమైన నిబంధనలున్నాగానీ, 23,239 ఇళ్ళ నిర్మాణానికి[22] సంబంధించి మొత్తం ₹72.58 కోట్ల విలువైన 45 పనులను వేరువేరు సంస్థలకు **నామినేషన్‌పై** అప్పగించారు (2006 మార్చి నుంచి 2008 డిసెంబరు వరకు). టెండర్ పిలుపులకు స్పందన లేనందున ఇలా చేశామని చెప్పారు. పనుల అప్పగింతకు సంబంధించిన దస్త్రాలను ఆడిట్ పరిశీలనకు అందచేయకపోవటంతో పనులు అప్పగించే ప్రక్రియలో పటిష్టత, పారదర్శకతకు ఆడిట్ హామీ ఇవ్వలేకపోతున్నది. అర్హులైన గుత్తేదారులనే నియోగించారన్న ధీమా కూడా లేదు. వాస్తవానికి, ఆరు ప్యాకేజీలలో మొత్తం ₹96 లక్షల విలువకల 96 ఇళ్ళ నిర్మాణ పనులను బ్లాక్ ప్రెసిడెంట్లకు అప్పగించారు (2006-07). వారు ఈ పనులకు అర్హత పొందినవారుకాదు.

### *4.6.3.3 ధరలు మార్చి పనులను అప్పగించటం*

తిరుపతి మునిసిపల్ కమిషనరు ₹72.83 కోట్ల విలువైన 4056 ఇళ్ళ నిర్మాణ పనులను 2008-09లో స్థానికంగా టెండర్లు పిలిచి సింగిల్ బిడ్ ప్రాతిపదికన 14 మంది గుత్తేదారులకు అప్పగించారు. తొలుత 2007 సెప్టెంబరు, అక్టోబరు, డిసెంబరులలో ఇచ్చిన టెండరు నోటీసులకు బదులు రాకపోవటంతో ఇలా చేసినట్లు తెలిపారు. తిరుపతి ఎమ్ఎల్ఏ, మునిసిపల్ కమిషనరుల సమక్షంలో జరిగిన మూడు సమావేశాలలో (2007 అక్టోబరు 16, 2007 అక్టోబరు 23, 2007 డిసెంబరు 10) గుత్తేదార్లు వెలిబుచ్చిన అభిప్రాయాల మేరకు ఆర్థిక, సాంకేతిక నిర్దిష్టతలను (స్పెసిఫికేషన్లు) సడలించి ఇంటి నిర్మాణ వ్యయాన్ని ₹1 లక్ష నుంచి ₹1.58 లక్షలకు, ఆతర్వాత

[21] ఎల్లారెడ్డిగూడ నాలా₹13.13 లక్షలు; బంజారాహిల్స్ నాలా ₹11.03 లక్షలు; పంజగుట్ట నాలా ₹21.63 లక్షలు; యూసుఫ్‌గూడ నాలా ₹18.62 లక్షలు; కళాసిగూడ నాలా ₹ 13.65 లక్షలు; నాగమయ్యగుంట నాలా ₹10.82 లక్షలు; మురికి నాలా (పి8, పి9,పి10) ₹32.04 లక్షలు; మురికి నాలా (పి11, పి12) ₹27.52 లక్షలు

[22] 13,793 ఇళ్ళ నిర్మాణం 45 ప్యాకేజీలుగా చేసి 31 గుత్తేదారులకు అప్పగించారు. మిగతా 9446 ఇళ్ళ నిర్మాణ సమాచారం ఇవ్వలేదు

₹2.04 లక్షలకు పెంచారు. జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ నియమాల ప్రకారం దీని ఖరీదు ₹80,000 ఉండాలి. అంతేకాక నిబంధనల మేరకు ఇంటి లోపలి విస్తీర్ణం 25 చ.మీటర్లు ఉండవలసి రాగా, సవరించిన అంచనాల లోనూ, వాస్తవ నిర్మాణంలోనూ లోపలి వైశాల్యం 14.74 చ.మీటర్లు, నిర్మాణ వైశాల్యం 20.96 చ.మీటర్లు ఉన్నాయి. ఈ విధంగా నిర్దిష్టతలను మార్చటం జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ నియమాలకు విరుద్ధం. అలాగే, సంప్రదింపులలో ధరలను మార్చటం కూడా ప్రభుత్వ నిబంధనలను (2003) అతిక్రమించటమే. కనుక కమీషనర్ చర్య సరికాదు.

## 4.7 ప్రాజెక్టుల నిర్మాణం

జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2012 మార్చి నాటికి 251[23] ప్రాజెక్టులను ఆమోదించింది. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

పట్టిక 4.4


(₹ కోట్లలో)

| అంశం | ప్రాజెక్టుల సంఖ్య | మురుగు నీటి పారుదల | వరదనీటి కాలువలు | నీటి సరఫరా | మౌలిక వసతులు/ గృహ నిర్మాణం | ఇతరం | ప్రాజెక్టు వ్యయం | కేంద్రం వాటా | రాష్ట్రం వాటా | పట్టణ స్థానిక సంస్థలు/ లబ్ధిదారుల వాటా |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| యూఐజీ | 54 | 11 | 12 | 16 | 0 | 15 | 5238 | 2200 | 817 | 2221 |
| బీఎస్‌యూపీ | 36 | 0 | 0 | 0 | 36 | 0 | 3012 | 1496 | 601 | 914 |
| యూఐడీఎస్ఎస్ఎమ్‌టీ | 84 | 8 | 9 | 62 | 0 | 5 | 2460 | 1968 | 246 | 246 |
| ఐహెచ్ఎస్‌డీపీ | 77 | 0 | 0 | 0 | 77 | 0 | 1197 | 764 | 155 | 278 |
| **మొత్తం** | **251** | **19** | **21** | **78** | **113** | **20** | **11907** | **6428** | **1819** | **3659** |

*మూలం : రాష్ట్రస్థాయి నోడల్ ఏజన్సీ*

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సమాచారం (2012 డిసెంబరు) ప్రకారం సంవత్సరాలవారీగా ఆమోదించిన ప్రాజెక్టులు, పూర్తయినవీ ఈ దిగువ రేఖాచిత్రాలలో వివరించటం జరిగింది.

చార్టు 4.1





23 రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబరులో ఇచ్చిన సమాచారం ప్రకారం మొత్తం ప్రాజెక్టులు 253. ఐతే, అంశాలవారీగా ప్రాజెక్టుల సంఖ్య, ప్రాజెక్టు వ్యయం విషయంలో స్వల్ప వ్యత్యాసాలున్నాయి. నోడల్ ఏజన్సీ వీటిని విశదీకరించవలసి ఉంది

ఆమోదించిన 251 ప్రాజెక్టులలో 101 ప్రాజెక్టులు (40 శాతం) పూర్తయ్యాయనీ, వీటిలోకూడా 9 మాత్రమే నిర్దేశించిన గడువులోగా పూర్తయ్యాయనీ పై రేఖాచిత్రం చూస్తే తెలుస్తుంది. ఆయా ప్రాజెక్టులు పూర్తికావలసిన తేదీలను నోడల్ ఏజన్సీ తెలుపలేదు. అందువలన మిగతా 92 ప్రాజెక్టులు నిర్ణీత గడువులోగా పూర్తయినట్లు ఆడిట్ నిర్ధారణకు రాలేదు.

### 4.7.1 మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టుల స్థితి

ఆడిట్ సవిస్తరంగా పరిశీలించేందుకు ఎంపిక చేసుకున్న 74 ప్రాజెక్టులకు సంబంధించి సెక్టారువారీ పరిస్థితి 2012 జూన్ నాటికి ఈ దిగువ రేఖా చిత్రంలో చూడవచ్చును.

చార్టు 4.2





పై రేఖా చిత్రం చూడగా, విస్తృత పరిశీలన కోసం ఆడిట్ ఎంపిక చేసిన 74 ప్రాజెక్టులలో 28 ప్రాజెక్టులు (38 శాతం) పూర్తవగా, 2012 జూన్ నాటికి ఇంకా 46 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. ఐతే, మరో ఐదు[24] ప్రాజెక్టులు పూర్తయినట్లు ప్రభుత్వం 2012 డిసెంబరులో తెలిపింది.

### 4.7.2 ప్రాజెక్టు నిర్మాణాలలో జాప్యం

అసంపూర్ణ ప్రాజెక్టులను ఆడిట్ విశ్లేషించగా అందుకు కారణాలు ఈ దిగువ విధంగా ఉన్నాయి.

చార్టు 4.3




** ఇతర కారణాలలో కోర్టు వివాదాలు, నీటి వనరులు గుర్తించకపోవటం, నిధుల కొరత మొదలైనవి ఉన్నాయి*

[24] మరో ఐదు ప్రాజెక్టులు (నీటి సరఫరావి 4, వరద నీటి కాలువ 1) పూర్తయినట్లు ప్రభుత్వం 2012 డిసెంబరులో తెలిపింది

ప్రభుత్వం ఈ వాస్తవాలను అంగీకరిస్తూనే, నిర్మాణక్రమంలో ఎదురయ్యే ప్రతిబంధకాలు, విధానపరమైన, సాంకేతికపరమైన సమస్యల వలన పనుల్లో జాప్యం జరిగిందనీ, 2012 ఫిబ్రవరిలో జారీ చేసిన మార్గదర్శకాలలో ఈ అడ్డంకులకు పరిష్కారం కనుకొన్నామనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

### 4.7.3 మురుగునీటి పారుదల

రాష్ట్రంలో మొత్తం ₹1,825 కోట్ల ఆమోదిత వ్యయంతో చేపట్టిన 19 మురుగునీటి పారుదల ప్రాజెక్టుల నుంచి 16 ప్రాజెక్టులను (84 శాతం) నమూనా పరిశీలన కోసం ఆడిట్ ఎంపిక చేసింది. వీటిని మొత్తం ₹1,781 కోట్ల వ్యయంతో 2005-09 సంవత్సరాలలో మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టుల మీద 2012 మార్చి నాటికి ₹1,090 కోట్లు ఖర్చు చేశారు. ఐతే, 2012 జూన్ నాటికి ఈ 16 ప్రాజెక్టులలో ఒక్కటి మాత్రమే వాడుకలోకి వచ్చింది.

మిషన్ సిటీలలో నమూనా తనిఖీ కోసం ఎంపిక చేసిన 3 ప్రధాన ప్రాజెక్టులలో ఆడిట్ గమనించిన ముఖ్యమైన అంశాలను, అలాగే మిషన్, నాన్-మిషన్ సిటీలలో ఎంపిక చేసిన మిగతా 12 ప్రాజెక్టులలో ఆడిట్ గమనించిన విషయాలను కలగలుపుగానూ ఈ కింద ఇవ్వటం జరిగింది ః

*మిషన్ సిటీలు*

#### *4.7.3.1 ఒకటవ మండలంలో[25] మూసీనదికి దక్షిణాన పాతబస్తీలో మురుగునీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ*

హైదరాబాద్ మహానగర నీటిసరఫరా మురుగునీటి పారుదల మండలి (జల మండలి) చేపట్టిన ఈ ప్రాజెక్టును మూడు ప్యాకేజీలుగా విభజించి, ₹161.73 కోట్ల ఒప్పందపు విలువకు పనులప్పగించారు (2007 డిసెంబరు నుంచి 2010 ఫిబ్రవరి మధ్యన). ఒప్పందపు తేదీ నుంచి 24 నెలలలో (ప్యాకేజీ I ః 2009 డిసెంబరు, ప్యాకేజీ II ః 2012 ఫిబ్రవరి, ప్యాకేజీ III ః 2010 జనవరి) పనులను పూర్తి చేయాలి. ఐతే, 2012 జూన్ నాటికి ప్రాజెక్టు అసంపూర్తిగానే ఉన్నది[26].

రెండవ ప్యాకేజీ కోసం 2007 జూన్ నుంచి 2009 ఫిబ్రవరి వరకు ఎనిమిది సార్లు టెండర్లు పిలిచినా బదులు రాలేదు. రెండుసార్లు టెండర్లు పిలిచినపుడు స్పందన రాకపోవడానికి కారణాలను విచారించి, జలమండలి తన భాగస్వామ్య సంస్థల సలహాపై సమగ్ర నివేదికలను, డిజైన్లను తగువిధంగా సవరించి ఉండాల్సింది కానీ, పదేపదే టెండర్లు ఆహ్వానిస్తూ తుదకు తొమ్మిదవ పిలుపులో (2009 మే) ఏపీఆర్ - రాంకీ అనే సింగిల్ ఫినాన్షియల్ బిడ్డర్‌కు 2010 ఫిబ్రవరిలో పనులప్పగించింది. టెండర్లు పిలిచిన దాదాపు సంవత్సరానికి ఇలా పనులప్పగించింది. ఆ తరువాత 2010 నవంబరులో పనులాపేసి ప్రధాన కాలువ మార్గాన్ని మార్చవలసి వచ్చింది.

ఈ కాలువ వెళ్ళవలసిన మార్గం సమగ్ర ప్రాజెక్టు నివేదికలో ప్రతిపాదించిన విధంగానైతే అది వారసత్వ సంపదకోణంలో తీవ్రమైన చిక్కులతో కూడుకొని ఉంది. చార్మినార్ ప్రాంతంలోని పలు పురాతన కట్టడాలకు ఇది సమీపంలో ఉంది. ఐతే, సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించే దశలో దీనిని అంతగా ఆలోచించలేదు. బహుశా, జీ హెచ్ఎమ్‌సీ[27], హెచ్ఎమ్‌డీఏ[28], హెరిటేజ్ కమిటీ, పోలీసు శాఖ వంటి భాగస్వామ్య సంస్థలతో కలసి సరైన క్షేత్రస్థాయి అధ్యయనం చేసి ఉండకపోవచ్చును. పనులప్పగించిన తరువాతనే ఈ సమస్యలను గుర్తించారు.

---

[25] ఎస్ 1 నుంచి ఎస్ 6, ఎస్ 12, ఎస్ 14 ఆయకట్టు ప్రాంతాలు

[26] భౌతికంగా, ఆర్థికంగా పూర్తయిన పనుల స్థితి శాతంలో ః ప్యాకేజీ-I ః 123 శాతం, 85 శాతం; ప్యాకేజీ-II ః 65 శాతం, 47 శాతం; ప్యాకేజీ - III ః 111 శాతం, 83 శాతం

[27] హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

[28] హైదరాబాద్ నగరాభివృద్ధి సంస్థ

ఆడిట్ గమనించిన వాటిని ప్రభుత్వం అంగీకరించి, ఆచరణపరమైన అవరోధాలను అధిగమించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది (2012 డిసెంబరు).

### *4.7.3.2 శేరిలింగంపల్లి మున్సిపాలిటీలో మురుగునీటి పారుదల బృహత్ ప్రణాళిక*

ఈ ప్రాజెక్టులో విలక్షణమైన రెండు అంశాలు ఇమిడి ఉన్నాయి :

- మురుగునీటి పారుదల వ్యవస్థను ₹106.93 కోట్ల వ్యయంతో 2011 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలి; ఐతే, 2012 జూన్ నాటికీ ఇది పూర్తి కాలేదు.
- మురుగునీటిని శుద్ధిచేసేందుకు ఆరు కేంద్రాలను నెలకొల్పి, అలా శుద్ధి చేసిన నీటిని సమీప జలాశయాలకు తరలించటం.

ఈ రెండు అంశాలకూ పనులను వేరువేరుగా అప్పగించారు. ఫలితంగా, మురుగునీటి పారుదల పనులు పురోగతిలో ఉన్నాగానీ, మురుగు శుద్ధి కేంద్రాల కోసం స్థల సేకరణ పూర్తి కానందున శేరిలింగంపల్లి వాసులకు 2012 జూన్ నాటికి ప్రయోజనమేదీ కలుగలేదు. అంతేకాకుండా, శుద్ధి కేంద్రాలు నెలకొల్పవలసిన స్థల నిర్ణయం కాకపోవటంతో, మురుగునీటి ప్రధానకాలువల కొనభాగాల విషయంలో స్పష్టతలేదు.

సమీక్ష ముగింపు సమావేశంలో (2013 జనవరి) ప్రభుత్వం ఆడిట్ వ్యాఖ్యలను అంగీకరిస్తూ, ఇకమీదట ప్రాజెక్టులలోని అన్ని అంశాలూ ఏకకాలంలో చేపట్టేలా చూస్తామని తెలిపింది.

### *4.7.3.3 విజయవాడలో భూగర్భ డ్రైనేజీ లేని చోట్ల సమకూర్చటం*

ఈ ప్రాజెక్టును ₹56.56 కోట్ల వ్యయంతో 2006 ఆగస్టులో ఆమోదించారు. మురుగు సేకరణ వ్యవస్థను రూపొందించటం, సంపు-పంపు హౌస్ నిర్మించి పంపు సెట్లను అమర్చటం, గొట్టాలనువేసి, మురుగు శుద్ధి కేంద్రాలను నిర్మించటం ఈ ప్రాజెక్టులోని భాగాలు. విజయవాడ నగరపాలక సంస్థ ఈ మొత్తం ప్రాజెక్టును 132 పనులుగా విభజించి వాటిని 2006-2010 సంవత్సరాల మధ్యన 52 మంది గుత్తేదారులకు అప్పగించింది. మొదలుపెట్టిన 132 పనులలో 2012 జూన్ నాటికి 128 పూర్తయ్యాయి. అసంపూర్తిగా ఉన్న నాలుగు పనులలో రెండు ప్రధానమైనవి. జక్కంపూడిలో 20 ఎమ్ఎల్‌డీ సామర్థ్యంతో, అప్‌ఫ్లో ఎనరోబిక్ స్లడ్జ్ బ్లాంకెట్ పరిజ్ఞానంతో మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మించతలచారు. ఈ పనిని ₹13.75 కోట్ల వ్యయంతో 15 నెలలలో పూర్తి చేసే షరతుమీద 2009 జూన్ నెలలో అప్పగించారు. ఐతే, ₹9.86 కోట్లు ఖర్చు చేసిన తర్వాత 2011 ఏప్రిల్ నుంచి పనులు నిలిచిపోయాయి. కారణాలు దస్త్రాలలో లభ్యం కాలేదు. ఇక మరో ప్రధానాంశమైన గొట్టాల అమరిక 2010 డిసెంబరు నుంచి సాగటంలేదు. జక్కంపూడి దగ్గర రైలు మార్గాన్ని దాటించేందుకు రైల్వే అధికారుల అనుమతి రాకపోవటంతో ఈ పనులాగిపోయాయి. ఇప్పటికే వీటి మీద ₹5.42 కోట్లు ఖర్చయింది. ఇలా పనులు పూర్తికాకపోవటంతో సంబంధిత పనుల మీద 2012 జూన్ వరకు చేసిన ₹66.22 కోట్ల ఖర్చు నిష్ఫలమైంది.

ఈ విషయమై ప్రభుత్వం నిర్దిష్ట సమాధానమివ్వలేదు.

### *4.7.3.4 ఇతర ప్రాజెక్టులు*

వివిధ మిషన్ సిటీలు, నాన్-మిషన్ సిటీలలో అసంపూర్తిగా ఉన్న 12 మురుగునీటి ప్రాజెక్టులలో ఆడిట్ గమనించిన అంశాలు ఈ విధంగా ఉన్నాయి.

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ఆడిట్ గమనించినది | 2012 జూన్ నాటికి వ్యయం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 1 | మూసీనదికి దక్షిణాన రెండవ మండలం పాత బస్తీలో మురుగునీటి పారుదల వ్యవస్థ పునుద్ధరణ, విస్తరణ (ఆయకట్టు ఎస్7 నుంచి ఎస్11, ఎస్13, ఎస్15) | ఈ ప్రాజెక్టును 2007-08లో ₹251.25 కోట్లకు ఆమోదించారు. ఇరుకుగా, జనసమ్మర్ధంగా ఉండే పాతబస్తీలో పనులు చేపట్టాల్సి రావటంతో పాటు తరచుగా చోటు చేసుకునే బంద్‌లు, పండుగల వంటివి నిర్మాణ పనులను ఆటంకపరచాయి. గడువు 15 నెలలు పొడిగించినా ప్రాజెక్టు పూర్తవలేదు. ఆడిట్ పేర్కొన్న కారణాలను ప్రభుత్వం రూఢి చేసింది (2012 డిసెంబరు). | 138.70 |
| 2 | విశాఖపట్నం నగర కేంద్ర భాగంలో మురుగునీటి వ్యవస్థను ఏర్పరచటం | ఈ ప్రాజెక్టును 2006-07లో 244.44 కోట్లకు మంజూరు చేశారు. స్థల సేకరణ జరగకపోవటం, జాతీయ రహదారి ప్రాధికార సంస్థ నుంచి, రైల్వేల నుంచి అనుమతులు అవసరం కావటం, మురుగు నీటి శుద్ధి కేంద్రాల స్థల మార్పిడి వలన పనులు పూర్తికాలేదు. నాలుగు ప్యాకేజీలలో ఒక్కటి మాత్రమే పూర్తయింది. నగరపాలక సంస్థ ₹264.01 కోట్ల అంచనావ్యయంతో ప్రాజెక్టు నివేదికను సవరించింది. (అదనపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం, నగరపాలక సంస్థ భరించి, 2013 మార్చిలోగా పూర్తి చేయాలి). ఈ నిర్మాణాలలో జాప్యం వలన మురుగునీరు బహిరంగ కాలువలలో ప్రవహించి పర్యావరణానికి ప్రమాదకారణ మవుతున్నాయి. ఆడిట్ వ్యాఖ్యలను ప్రభుత్వం అంగీకరించింది (2012 డిసెంబరు). సవరించిన ప్రాజెక్టు నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపామనీ, అదనపు వ్యయాన్ని నగరపాలక సంస్థ భరిస్తుందనికూడా తెలిపింది. | 189.11 |
| 3 | విశాఖపట్నం పాత బస్తీ ప్రాంతంలో మురుగు నీటి పారుదల వ్యవస్థ ఏర్పరచటం | ఈ ప్రాజెక్టు 2009 అక్టోబరులో పూర్తయింది. ఐతే, ఉద్దేశించిన 13000 ఇళ్ళకు బదులు 10339 ఇళ్ళకే భూగర్భ డ్రైనేజీ కల్పించారు. ఎలైన్‌మెంట్ల వ్యయం అధికంగా ఉండటం, స్థల సేకరణ సమస్యల వలన పనుల్లో జాప్యం జరిగినట్లు చెప్పారు. ఈ పథకం కింద నిర్మించిన శుద్ధి కేంద్రాల నుంచి 12 ఎమ్ఎల్‌డీ బదులు 3.6 ఎమ్ఎల్‌డీ శుద్ధ జలాలను మాత్రమే విక్రయించారు.<br>వినియోగ రుసుమును 2012 ఏప్రిల్ నుంచి వసూలు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). ఐతే, ఈ ప్రతిపాదనను కౌన్సిల్ ఆమోదించినప్పటి నుంచీ (2008 జూలై, 2011 ఆగస్టు) ఈ రుసుము వసూలు చేయకపోవటానికి కారణాలు తెలుపలేదు. మిగతా శుద్ధ జలాలను అమ్మేందుకు టెండరు ప్రక్రియ సాగుతున్నదని కూడా ప్రభుత్వం తెలిపింది. | 35.95 |
| 4 | విజయవాడ నగరం ఉత్తర భాగంలో మురుగు నీటి పారుదల వసతి కల్పించటం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹178.15 కోట్లకు మంజూరు చేశారు. పనులప్పగించటంలో జాప్యంతోపాటు ఇసుక కొరత వంటి ఇతర ఇబ్బందుల వలన పనులు పూర్తికాలేదు. తొలి టెండర్లకు స్పందన రాలేదని చెప్పిన ప్రభుత్వం ఈ పనులను 2013 జూన్ నాటికి పూర్తి చేస్తామని పేర్కొంది (2012 డిసెంబరు). | 60.55 |

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ఆడిట్ గమనించినది | 2012 జూన్ నాటికి వ్యయం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 5 | మిర్యాలగూడ మురుగు నీటి పారుదల పథకం | ఈ ప్రాజెక్టును 2006-07లో ₹34.93 కోట్లకు మంజూరు చేశారు. స్థలసేకరణ చేయకపోవటం, డిజైన్లను ఖరారు చేయకపోవటం వలన మురికినీటి శుద్ధి కేంద్రాలు రెండింటి నిర్మాణం పూర్తవలేదు. ఇప్పటికి 80 శాతం పని పూర్తయిందని చెబుతూ, రెవెన్యూ అధికారులను నిరంతరం కోరుతున్నా స్థల సేకరణ జరగలేదని ప్రభుత్వం తెలిపింది. | 29.70 |
| 6 | నరసరావు పేట మురుగు నీటి పారుదల పథకం | ఈ ప్రాజెక్టును 2006-07లో ₹26.41 కోట్లకు మంజూరు చేశారు. స్థల సేకరణలోని జాప్యం, మురుగునీటి శుద్ధి పరిజ్ఞానం ఖరారు చేయకపోవటం వలన పనులు పూర్తవలేదు. వాస్తవాలను ప్రభుత్వం ధృవీకరించింది. | 23.36 |
| 7 | నగరి మురుగు నీటి పారుదల (ఈటీపీ) పథకం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹9.83 కోట్లకు మంజూరు చేశారు. ఐతే, మురికినీటి శుద్ధి కేంద్రానికి (ఈటీపీ) స్థల నిర్ణయం కాకపోవటంతో నిర్మాణం పూర్తవలేదు. గ్రామస్తులు వ్యతిరేకించటం వలన వేరే స్థలాన్ని ఎంపిక చేశామనీ, ఇందువలన గుత్తేదారుకు గడువు పొడిగించాల్సి వచ్చిందనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). | 11.18 |
| 8 | కడప మురుగునీటి పారుదల పథకం | ఈ ప్రాజెక్టును 2006-07లో ₹49.15 కోట్లకు ఆమోదించారు. దీనిలో 20 ఎమ్ఎల్‌డీ సామర్థ్యంతో రెండు శుద్ధి కేంద్రాలు తలపెట్టగా స్థల సేకరణ జరగకపోవటంవలన ఒకదాని నిర్మాణం ఇంకా చేపట్టలేదు. ప్రభుత్వం ఈ విషయం ధృవీకరించింది (2012 డిసెంబరు). | 63.32 |
| 9 | నిజామాబాద్ మురుగునీటి పారుదల పథకం | ఈ ప్రాజెక్టును 2006-07లో ₹81.06 కోట్లకు ఆమోదించారు. అనుకున్న మూడు శుద్ధి కేంద్రాలు అసంపూర్ణంగానే ఉన్నాయి. నిధుల కొరత, స్థలసేకరణలో జాప్యం వలన అంచనాలను సవరించవలసి వచ్చింది. వాస్తవాలను ప్రభుత్వం అంగీకరించింది (2012 డిసెంబరు). నష్టపరిహారం పూర్తిగా చెల్లించకపోవటంతో స్థల యజమానులు సర్వేను అడ్డుకుంటున్నారనీ రెవెన్యూ అధికారులు స్థల సేకరణ చేసేందుకు ఇది ప్రతిబంధకమయిందనీ ప్రభుత్వం తెలిపింది. | 55.53 |
| 10 | నల్గొండ మురుగునీటి పారుదల పథకం | ఈ ప్రాజెక్టును 2006-07లో ₹46.88 కోట్లకు ఆమోదించారు. స్థలసేకరణ చేపట్టకపోవటం, తగు సాంకేతిక విధానం ఖరారు చేయకపోవటంవలన మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణం పూర్తి కాలేదు. స్థలసేకరణ, సాంకేతిక విధానాలు నిశ్చయించటంలోని జాప్యంవలన అంచనాలు సవరించవలసివచ్చిందనీ, ఆకారణంగా మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం చేపట్టలేక పోయామనీ ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). | 41.16 |
| 11 | ఎమ్మిగనూరు మురుగునీటి పారుదల పథకం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹39.83 కోట్లకు ఆమోదించారు. స్థల సేకరణలోని జాప్యం కారణంగా మురుగునీటి శుద్ధి కేంద్రం, మురుగునీటి గుంటల నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. | 27.89 |

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ఆడిట్ గమనించినది | 2012 జూన్ నాటికి వ్యయం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 12 | కరీంనగర్ మురుగునీటి పారుదల పథకం | ఈ పథకం 2006-07లో ₹62.37 కోట్లకు ఆమోదంపొందింది. గొట్టాలు వేయటానికి రహదార్లు భవనాల శాఖ నుంచి అనుమతి రాకపోవటం, డిజైన్లలో మార్పులు, ఇంకా గుత్తేదారు వెలిబుచ్చిన మరికొన్ని అవరోధాల కారణంగా, గడువు పొడిగించినాగానీ పనులు పూర్తి కాలేదు. | 44.91 |

## 4.7.4 వరదనీటి కాలువలు

మొత్తం ₹676 కోట్ల ఆమోదిత వ్యయంతో చేపట్టిన 21 వరదనీటి కాలువ ప్రాజెక్టులలో విస్తృత పరిశీలన కోసం మొత్తం ₹542 కోట్ల ఆమోదిత విలువకల 17 ప్రాజెక్టులను (81 శాతం) ఆడిట్ ఎంపిక చేసుకుంది. వీటిలో 2012 జూన్ నాటికి ఏడు మాత్రమే పూర్తయ్యాయి. మిషన్ సిటీలలో ఎనిమిది ప్రాజెక్టులను ఎంపిక చేసుకోగా వాటిలో రెండు ప్రాజెక్టులు, అలాగే నాన్-మిషన్ సిటీలలో ఎంపిక చేసుకున్న తొమ్మిదింట ఐదు ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఆరు ప్రాజెక్టులలో గమనించిన ముఖ్యాంశాలను ఈ దిగువ విశదీకరించి, తదుపరి నాలుగు ప్రాజెక్టులలో గమనించిన అంశాలను క్లుప్తంగా ఇవ్వటం జరిగింది.

### *4.7.4.1 జీ హెచ్ఎమ్సీలో ఐదు వరదనీటి కాలువల నవీకరణ, విస్తరణ-మురికినాలా (పి8,పి9,పి10), మురికినాలా (పి11,పి12), కూకట్‌పల్లి, బేగంపేట నాలా; బల్కాపూర్ కాలువ, ఒకప్పటి హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ (ఎమ్సీ హెచ్) జోన్ I,IIలలో వరదనిటి కాలువల విస్తరణ*

తొలుత సాగునీటి పారుదల శాఖ నాలుగు ప్రాజెక్టులను[29] చిన్న చిన్న ప్యాకేజీ లుగా విభజించి చేపట్టింది (2005-2010). తదుపరి జీ హెచ్ఎమ్సీ మిగిలిన నాలుగు పనులను, ఒకప్పటి ఎమ్సీహెచ్‌లోని జోన్ - I, జోన్ - IIకు సంబంధించిన వరదనీటి కాలువల విస్తరణ పనులతోపాటు (18 పనులు) చేపట్టింది. ఈ పనులేవీ 2012 జూన్ నాటికి పూర్తికాలేదు. స్థలసేకరణలో జాప్యమే దీనికి కారణంగా పేర్కొన్నారు. ఐతే, స్థలసేకరణ కోసం అభ్యర్థన పంపిన విషయం ఈ పనులకు సంబంధించిన దస్త్రాలలో ఎక్కడా ప్రస్తావించకపోవటం ఆడిట్ గమనించింది. ఈ పనులమీద 2012 జూన్ నాటికి మొత్తం ₹40.89 కోట్లు ఖర్చు చేసినాగానీ పనులు పూర్తికాలేదు.

ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామనీ, ఆక్రమణలులేని స్థలాలలో పనులు కొనసాగుతున్నాయనీ ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). ఆచరణలో ఎదురవుతున్న అడ్డంకులు, నిర్మాణంలో జాప్యానికి తావిస్తూ తలెత్తే విధానపరమైన, సాంకేతికపరమైన సమస్యలను ఇటీవల 2012 ఫిబ్రవరిలో తాజాగా రూపొందించిన సమగ్ర మార్గదర్శకాలలో అధిగమించామని కూడా ప్రభుత్వం తెలిపింది.

### *4.7.4.2 విశాఖపట్నం జోన్ VIIIలో వరదనీటి కాలువల విస్తరణ (గంగులహెడ్డ, ఎర్రిగడ్డ బ్రాంచి కాలువలు)*

కాలువలను విస్తరించి, లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు తొలగించటం, ట్రాఫిక్ చిక్కులను అధిగమించటం కోసం ₹72.27 కోట్ల అంచనా వ్యయంతో మొత్తం 16.39 కి.మీ. పొడవైన కాలువలను విస్తరించే ఈ ప్రాజెక్టును చేపట్టారు. మొత్తంపనిని మూడు ప్యాకేజీలుగా విభజించి 2011 జూన్‌లోగా పూర్తిచేసే విధంగా అప్పగించారు

[29] మురికినాలా (పి8,పి9,పి10), మురికినాలా (పి11,పి12), కూకట్‌పల్లి మరియు బేగంపేట నాలా, బల్కాపూర్ వరదనీటి కాలువల నవీకరణ

(2009 అక్టోబరు - డిసెంబరు). ఐతే, నిర్మాణాలప్పుడు ఉత్పన్నమయ్యే ఆటంకాలైన ఆక్రమణలు, విద్యుత్ స్తంభాలను, తీగలను తరలించటం వంటి విషయాలను సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించే సమయంలో పరిగణించలేదని ఆడిట్ పరిశీలనలో తెలిసింది. దీంతో, 2012 జూన్ నాటికి పనులేవీ పూర్తవలేదు. చైనేజీ 750 నుంచి 770 దగ్గర జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ అపార్టుమెంటు కూడా ఒక అవరోధమయింది. ఈ విషయాలను ఇర్మా నివేదిక సైతం ధృవీకరించింది. పట్టణ ప్రణాళిక విభాగంతోపాటు ప్రత్యేక దళాలను కూడా ఏర్పాటు చేసి ఆక్రమణలు తొలగిస్తున్నామనీ, డిసెంబరు 2012 నాటికి పనులు పూర్తవుతాయనీ రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది (2012 డిసెంబరు). ఐతే, పనులు పూర్తి చేసిన సమాచారమేదీ 2013 జనవరినాటికి అందలేదు.

### 4.7.4.3 ఇతర ప్రాజెక్టులు

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ఆడిట్ గమనించినది | 2012 జూన్ నాటికి వ్యయం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 1 | సూర్యాపేట వరదనీటి కాలువ పథకం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹24.64 కోట్లకు మంజూరు చేశారు. మురికినీటిని శుద్ధిచేసే కేంద్రానికి అవసరమైన స్థల సేకరణ చేయక పోవటంతో ఇది పూర్తికాలేదు. రెవెన్యూ అధికారులు స్థలసేకరణ పనిలో ఉన్నారనీ, స్థలం ఇంకా స్వాధీనం చేయలేదనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు). | 9.73 |
| 2 | అనకాపల్లి వరదనీటి కాలువ పథకం | ఈ ప్రాజెక్టును 2006-07లో ₹22.22 కోట్లకు మంజూరు చేశారు. రైల్వేలు, రహదార్లు-భవనాలు, నీటిపారుదల శాఖల నుంచి అనుమతులు రాకపోవటంతో ఇది పూర్తికాలేదు. జాప్యాన్ని అంగీకరిస్తూనే, అనుమతులు సంపాదించేందుకు చర్యలు చేపట్టినట్టు ప్రభుత్వం పేర్కొంది (2012 డిసెంబరు). | 13.80 |
| 3 | మిర్యాలగూడ వరదనీటి కాలువ పథకం | ఈ ప్రాజెక్టు 2008-09లో ₹34.35 కోట్లకు మంజూరైంది. కానీ ఆగస్టు, మార్చి నెలల మధ్య ఎన్ఎస్ కాలువ నుంచి నీరు పారటం, భారీ వర్షాల వంటి చిక్కుల వలన పనులలో జాప్యం జరిగింది. ఐతే, ఎన్ఎస్ కాలువ నుంచి నీరుప్రవహించే విషయం ముందు తెలిసినదే కాబట్టి ఇది ఒప్పుకొన తగిన కారణం కాదు.<br>రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ ఇచ్చిన సమాచారం (2012 డిసెంబరు) ప్రకారం ఈ ప్రాజెక్టు పూర్తయింది. | 10.99 |
| 4 | నల్గొండ వరదనీటి కాలువ పథకం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹35.86 కోట్లకు ఆమోదించారు. ఇది అసంపూర్తిగానే మిగిలింది. మరికొన్ని క్రాస్ సెక్షన్లను ప్రాజెక్టు పరిధిలో చేర్చటంతోపాటు స్థల సేకరణలోని జాప్యం, భారీ వర్షాల వంటి ప్రతిబంధకాలు నిర్మాణంలోని ఆలస్యానికి కారణాలుగా తెలిపారు. | 23.03 |

## 4.7.5 నీటి సరఫరా

రాష్ట్రంలో మొత్తం ₹3,642 కోట్ల ఆమోదిత వ్యయంతో చేపట్టిన 78 నీటి సరఫరా ప్రాజెక్టుల నుంచి 2005-09 సంవత్సరాల మధ్య మొత్తం ₹2,457 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైన 35 ప్రాజెక్టులను ఆడిట్ విస్తృత పరిశీలన కోసం ఎంపిక చేసుకుంది. ఈ 35 ప్రాజెక్టులలో 2012 జూన్ నాటికి 11 ప్రాజెక్టులు మాత్రమే ప్రారంభమయ్యాయి. వీటిలో ఆడిట్ గమనించిన విశేషాంశాలను ఈ దిగువ వివరించటం జరిగింది.

### *4.7.5.1 కృష్ణా తాగునీటి సరఫరా పథకం (రెండవ దశ)*

కృష్ణా తాగునీటి సరఫరా పథకం (రెండవ దశ) కోసం ప్రభుత్వం 2006 ఫిబ్రవరిలో ₹830 కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర ప్రాజెక్టు నివేదికను సమర్పిస్తూ దీనిని ₹223.50 కోట్ల వ్యయంతో ఆరంభించనున్నట్లు సూచించింది. ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం 2007 నవంబరులో ₹606.50 కోట్లకు ఆమోదిస్తూ దీనిని ***2007 నవంబరు*** నాటికే పూర్తి చేయాలని తెలిపింది. సమగ్ర ప్రాజెక్టు నివేదికను కేంద్ర పభుత్వం ఆమోదించటానికి చాలా ముందే ప్రాజెక్టులోని ప్రధానాంశాలను పూర్తి చేసుకుని 2007 ఏప్రిల్‌లోనే పథకం పాక్షికంగా పనిచేయటం ప్రారంభించింది. మిగతా చిల్లరమల్లర అంశాలు, రింగ్ మెయిన్స్‌కు అనుబంధమైనవి కూడా పూర్తి చేసుకుని ఈ పథకం 2008 నవంబరులో పని ఆరంభించింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపకముందే ప్రాజెక్టు పాక్షికంగా పూర్తి కావటం, తగిన పత్రాలు కూడా లేకపోవటంతో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదించిన ఖర్చులలోని యదార్థతని ఆడిట్ పరిశీలించలేకపోయింది.

అప్పట్లో (2005-06) నెలకొన్న నీటి ఎద్దడి దృష్ట్యా నగరానికి నీటి సరఫరా తక్షణమే మెరుగు పరచాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును 2005 మే, 2006 జనవరి మధ్యన ఆరంభించామని ప్రభుత్వం ప్రత్యుత్తరమిచ్చింది (2012 డిసెంబరు). వీటికి సంబంధించిన వివరాలుగానీ, పత్రాలను గానీ ఆడిట్ ముందుంచలేదు.

### *4.7.5.2 పాత ఎమ్‌సీహెచ్‌లోని 10 జోన్ల పంపిణీ వ్యవస్థతోపాటు ఫీడర్ వ్యవస్థల పునరుద్ధరణ*

మూసీనదికి ఉత్తర, దక్షిణ భాగాలలోని 10 మండలాలలో నీటి సరఫరా కోసం తలపెట్టిన 14 కొత్త రిజర్వాయర్లకు ప్రవేశ మార్గం, బయటకు మార్గం నిర్మించేందుకు ₹232.22 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు 2008 జూలై నెలలో మంజూరైంది. రిజర్వాయర్ల నిర్మాణం జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కింద రెండు వేరువేరు ప్రాజెక్టులుగా అనుమతించారు.

ఈ 14 రిజర్వాయర్లకుగాను, 12 నిర్మాణాలు 2011 డిసెంబరు నాటికి పూర్తయినా, ప్రవేశ మార్గాలు, నీరు బయటికి వెళ్ళే మార్గాలకు సంబంధించిన పనులు (మచ్చుకు ఎంపిక చేసిన ప్రాజెక్టు) 2012 జూన్ నాటికి అసంపూర్తిగానే ఉన్నాది[30]. ఈ పనులను 2009 ఫిబ్రవరి, 2011 మార్చి నెలల మధ్యలో అప్పగించి ఆరు/తొమ్మిది నెలలో పూర్తి చేయాలని షరతు పెట్టారు. ఆయా ప్రాంతాలలో రోడ్లను తవ్వేందుకు సంబంధిత అధికారులు విడివిడిగా అనుమతించటంతో ఇది ప్రతి మండలంలోనూ పనుల పురోగతిపై ప్రభావం చూపిందని జలమండలి పేర్కొంది. సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు పొందకపోవటం, ఎన్నికలు, పండుగలు, బంద్‌ల వంటి వాటిని జాప్యానికి కారణాలుగా చూపుతూ ప్రభుత్వం అన్ని భాగస్వామ్య సంస్థలను సంప్రతించి ఈ తరహా జాప్యాలు పునరావృతం కాకుండా తగు విధానం కనుగొంటామనీ, కొనసాగుతున్న పథకాలను పూర్తి చేయటంలోనూ, కొత్త పథకాలు చేపట్టినప్పుడూ ఇలాంటి జాప్యాలను నివారిస్తామనీ పేర్కొంది (2012 డిసెంబరు).

### *4.7.5.3 జీహెచ్ఎమ్‌సీ పరిసరాల్లోని 32 ప్రాంతాలలో తాగునీటి సరఫరా*

ఈ ప్రాజెక్టును ₹240.74 కోట్లకు 2008 ఫిబ్రవరిలో మంజూరు చేశారు. దీనిని రెండు ప్యాకేజీలుగా విభజించి 2008 అక్టోబరు/2009 జనవరిలో వేరువేరు గుత్తేదారులకు అప్పగించారు. నీటి శుద్ధి కేంద్రం, పంపు హౌసులు, నీటి ట్యాంకులు/జలాశయాలు, అనుబంధ మౌలిక వసతులు ఒక ప్యాకేజీ కాగా నీటి పంపిణీకి గొట్టాలు వేయటం రెండవది. ఈ పనులు 24 నెలలలో పూర్తి కావలసి ఉంది. ఆడిట్ గమనించిన విషయాలు ఈ విధంగా ఉన్నాయి :

[30] మొత్తం 15 ప్యాకేజీలకు గాను మూడు మాత్రమే పూర్తయ్యాయి

- మొత్తం 53 నీళ్ళ ట్యాంకులు/జలాశయాలకుగాను (ఈఎల్ఎస్ఆర్/జీ ఎల్ఎస్ఆర్[31]) 43 పూర్తయ్యాయి; మరో 9 జలాశయాల పనులు జరుగుతుండగా ఒక జలాశయం పని 2012 జూన్ నాటికి ఇంకా మొదలు కాలేదు. రైల్వేలు, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, విశాఖపట్నం ఉక్కు కర్మాగారం, రెవెన్యూ శాఖల నుంచి స్థలం సేకరించకపోవటమే పనులు పూర్తికాకపోవటానికి ప్రధానకారణం.

- అవసరమైన స్థలాన్ని విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ఇవ్వకపోవటంతో అత్తవారిపాలెంలో నిర్మించ తలపెట్టిన 85 ఎమ్ఎల్‌డీ[32] నీటి శుద్ధి కేంద్రం అగనంపూడికి మార్చవలసి వచ్చింది. ఫలితంగా నీటి శుద్ధి కేంద్రం ఆరంభ దశలోనే ఉన్నది.

- నీటి సరఫరా గొట్టాలు వేసేపని 90 శాతం పూర్తయినాగానీ, ట్యాంకులు, జలాశయాలు, నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం మాత్రం వెనుబడి ఉన్నాయి (2010 అక్టోబరు). పర్యవసానంగా, విశాఖపట్నం పరిసర ప్రాంతాల వారు బోరు బావులమీద, ట్యాంకర్ల ద్వారా చేసే అరకొర సరఫరామీదా ఆధారపడుతున్నారు.

పనుల్లో జాప్యం జరిగిన మాట వాస్తవమేనని అంగీకరిస్తూ, స్థలసేకరణ పూర్తయిందనీ, పనులు పురోగతిలో ఉన్నాయనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

### *4.7.5.4 విశాఖపట్నం మహానగర పాలక సంస్థ పరిధిలోని పాతనగరంలో సమగ్ర నీటి సరఫరా వ్యవస్థ*

పాతనగరంలోని 6 బ్లాకులలో ఉన్న 1.25 లక్షల జనాభాకు ప్రతిరోజూ అన్నివేళలా నీటి సరఫరా కల్పించే దిశగా ఈ ప్రాజెక్టును 2009 మార్చి నెలలో ₹47.93 కోట్ల వ్యయంతో మంజూరు చేశారు. జీఎల్ఎస్ఆర్, ఈఎల్ఎస్ఆర్, సంప్-కం-పంప్‌హౌస్ వంటి అన్ని అవసరాలకు స్థలాల లభ్యత గురించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలో స్పష్టంగా ఉన్నది. ఐతే, ఆయా అవసరాలకు తగిన స్థలాలు జీవీఎమ్‌సీ స్వాధీనంలో లేవు. అలా, అవాస్తవాల ఆధారంగా సమగ్ర ప్రాజెక్టు నివేదికపై కేంద్ర ప్రభుత్వ ఆమోదం పొందారు. దేవాదాయ శాఖ, వీపీటీ వంటివి స్థలాలు స్వాధీనం చేయటంలో ఆలస్యం చేయటంవలన 575 కేఎల్, 1050 కేఎల్ ఈఎల్ఎస్ఆర్, 6000 కేఎల్ జీ ఎస్‌బీఆర్, సంప్-కం-పంప్‌హౌస్ నిర్మాణం 2011 డిసెంబరులో పూర్తి కావలసినది 2012 జూన్ నాటికి అసంపూర్తిగానే ఉన్నాయి. గుత్తేదారులకు చెల్లింపులు చేయటంలోని ఆలస్యం, ₹8.19 కోట్లు ఇతర ప్రాజెక్టులకు మళ్ళించటం వలన కూడా పురోగతి కుంటుపడింది. జీ ఎల్ఎస్ఆర్, ఈఎల్ఎస్ఆర్ నిర్మాణాలు, పైపులైన్లు వేయటం వంటివి పూర్తి కాకపోయినా, 12000 నీటి మీటర్ల కొనుగోలు కోసం జీవీఎమ్‌సీ చెల్లింపులు చేసింది. అవి 2010 ఏప్రిల్ నుంచీ నిరుపయోగంగా పడి ఉన్నాయి.

పనుల్లోని జాప్యాన్ని ప్రభుత్వం అంగీకరించి, అన్ని సమస్యలూ పరిష్కరించామనీ, పనులు కొనసాగుతున్నాయనీ తెలిపింది (2012 డిసెంబరు).

### *4.7.5.5 జీవీఎమ్‌సీ మధ్య ప్రాంతంలోని ఈశాన్య మండలంలో సమీకృత నీటి సరఫరా పునరుద్ధరణ*

ఈ ప్రాజెక్టును 2009 మార్చి నెలలో ₹190.18 కోట్లకు మంజూరు చేశారు. ప్రస్తుత జనాభా 4.60 లక్షలకే కాక 2023 సంవత్సరానికి అంచనా వేసిన 5.38 లక్షల మందికి కూడా తలసరి నీటి సరఫరా 150 ఎల్‌పీసీడీ వరకూ నమ్మకంగా అందించే దిశగా ఈ ప్రాజెక్టును తలపెట్టారు. రాయివాడ, వైఎల్ఎమ్‌సీ, నార్వ, తాటిపూడి వంటి వివిధ జల వనరుల నుంచి పట్టణ పంపిణీ జలాశయానికి తరలించే 118.84 ఎమ్ఎల్‌డీ నీరు మొత్తాన్ని ఇందుకు వినియోగించుకోవాలి. ఈ పనులను 2009 డిసెంబరులో అప్పగించి 2012 డిసెంబరులోగా పూర్తిచేయాలని నిర్దేశించారు. ఆడిట్ గమనించిన అంశాలు ఈ విధంగా ఉన్నాయి :

---

[31] ఈఎల్ఎస్ఆర్ : ఎత్తుగా నిర్మించిన నీళ్ళ టాంకు; జీఎల్ఎస్ఆర్ : నేలపై నిర్మించిన జలాశయం

[32] ఎమ్ఎల్‌డీ : రోజుకి పది లక్షల లీటర్లు

- మధ్య ప్రాంతంలో సమీకృత నీటి సరఫరా వ్యవస్థ పునరుద్ధరణ పనులకు ₹425.89 కోట్ల అంచనా వ్యయంతో ఒక సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించారు. ఐతే, కేంద్ర ప్రభుత్వం ఈశాన్య విభాగానికి మాత్రం ₹190.18 కోట్ల వ్యయంతో ఆమోదం తెలిపింది. ఈశాన్య విభాగానికి రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను ఆడిట్‌కు గానీ ఇర్మాకు గానీ అందచేయలేదు. ఈ నివేదిక అందుబాటులో లేని కారణంగా, ఈ ప్రాజెక్టు కింద చేపట్టిన పనులలోని ప్రామాణికతను ఆడిట్ పరిశీలించలేకపోయింది.

- రిజర్వాయరును ఎమ్‌వీపీ కాలనీ నుంచి రేసవానిపాలెంకు మార్చటం వలన, మట్టి పరీక్షలు మళ్ళీ చేయవలసి రావటం వలనా నిర్మాణపు పనులు ఆలశ్యమయ్యాయి. స్థల మార్పు వలన డిజైన్లను మరోసారి రూపొందించి ఆమోదం పొందవలసి ఉంది. ప్రజా ప్రతినిధుల కోరిక మేరకు రిజర్వాయరు స్థల మార్పిడి చేయవలసి వచ్చిందని ప్రభుత్వం పేర్కొంది (2012 డిసెంబరు). ఐతే, ప్రాజెక్టు మొదలు పెట్టే ముందు స్థల నిర్ణయం సరిగా చేయనందున పనులు ఆలస్యమయ్యాయన్నది వాస్తవం.

- ఒప్పందంలో జీవీఎమ్‌సీ నిర్ణయించిన మైలురాళ్ళ మేరకు పనులు నిర్వహించటంలో గుత్తేదారు విఫలమైనట్టు ఇర్మా తన నివేదికలో పేర్కొంది (2012 ఫిబ్రవరి). ఆర్థిక పురోగతి 2012 జనవరి చివరకు 80 శాతం ఉండాలని నిర్దేశించగా 49 శాతం మాత్రమే సాధించింది. అదేవిధంగా గొట్టాల కొనుగోలులో 55 శాతం, నిర్మాణ పనులలో 45 శాతం లోటు ఉంది. స్థలం సమస్యలు, శ్రామిక సమస్యలు, పని నిర్వహణలోని సంకట స్థితులు, చెల్లింపులలోని జాప్యం వంటి పలు కారణాలు పనుల్లోని పురోగతిని ప్రభావితం చేశాయని ప్రభుత్వం పేర్కొంది (2012 డిసెంబరు).

- ఈ ప్రాజెక్టు కోసం విడుదల చేసిన ₹33 కోట్లు జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పరిధిలోనే మరొక ప్రాజెక్టుకు మళ్ళించటం వలన కూడా పనులలోని పురోగతి మందగించింది.

### *4.7.5.6 జీవీఎమ్‌సీ గాజువాక ప్రాంతానికి తాగునీటి సరఫరా వృద్ధి*

గాజువాక మునిసిపాలిటీలో తాగునీటి అవసరాలకూ, సరఫరాకూ మధ్య వ్యత్యాసం తొలగించే దిశగా ఈ ప్రాజెక్టును 2007 ఏప్రిల్‌లో ₹39.76 కోట్లకు ఆమోదించారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారం 2 ఎమ్‌జీడీ[33] (7.57 ఎమ్ఎల్‌డీ) స్థాపక సామర్థ్యంతో 1995లో నెలకొల్పిన పథకం ఒక్కటే ఇక్కడ రక్షిత తాగునీటి వనరు. గాజువాక మున్సిపాలిటీతో చేసుకున్న ఒప్పందం మేరకు ఉక్కు కర్మాగారం 0.80 ఎమ్‌జీడీ (3ఎమ్ఎల్‌డీ) నీటిని సరఫరా చేస్తోంది. ఈ నేపథ్యంలో 2007 జూన్, 2009 నవంబరు మధ్యన ఈ ప్రాజెక్టు పనులప్పగించారు. దీనిని 2012 డిసెంబరులో పూర్తి చేసినట్టు తెలిపారు. స్థల సేకరణలోని జాప్యం వలనా, రైల్వే అధికారుల నుంచి అనుమతి పొందటంలో జాప్యం వలనా ప్రాజెక్టు సకాలంలో పూర్తికాలేదు.

గాజువాక ప్రాంతంలో 2038 సంవత్సరానికి ఊహించిన 120 ఎమ్ఎల్‌డీ గిరాకీని తట్టుకునేలా ఈ ప్రాజెక్టును రూపొందించాలని సమగ్ర నివేదికలో తలచారు. ఐతే, ఇది కేవలం 57.50 ఎమ్ఎల్‌డీ సామర్థ్యంతో రూపొందింది. ఆవిధంగా ఈ ప్రాజెక్టు ప్రస్తుత అవసరాలకు మాత్రమే సరిపోతుంది. ఇది జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ విధానాలకు అనువుగాలేదు. సీపీహెచ్ఈఈఓ మార్గదర్శకాల మేరకు డబ్ల్యూటీపీలను 15 సంవత్సరాల భావి అవసరాలకు తగినట్లు రూపొందించామని ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). ఐతే, సమగ్ర ప్రాజెక్టు నివేదిక ప్రకారం రాగల 15 సంవత్సరాల గిరాకీ 79.42 ఎమ్ఎల్‌డీ కాగా 57.50 ఎమ్ఎల్‌డీ సామర్థ్యంతో నిర్మాణం చేపట్టారు. ఆవిధంగా ఈ సమాధానం ఆమోదయోగ్యంకాదు.

[33] ఒక యూఎస్ గాలను 3.785 లీటర్లకు సమానం

### 4.7.5.7 జీవీఎమ్‌సీలోని గాజువాక ప్రాంతానికి నీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు (రెండవ దశ)

ప్రస్తుతం వినియోగంలో ఉన్న సరఫరా వ్యవస్థ ఈ ప్రాజెక్టు పరిధిలోని 50 శాతం ప్రాంతానికే ఉపయోగ పడుతున్నందున గాజువాకలో నీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకోసం ఈ పథకాన్ని ₹46 కోట్ల అంచనా వ్యయంతో 2008 జనవరిలో ఆమోదించారు. ఈ ప్రాజెక్టు 2009 డిసెంబరులోనే పూర్తి కావలసి ఉండగా, 2012 మార్చి నాటికీ పూర్తికాలేదు. రహదారులు - భవనాల శాఖ, విద్యుత్ సంస్థ, ఆం.ప్ర. పారిశ్రామిక వసతుల సంస్థ, విశాఖపట్నం ఉక్కు కార్మాగారం, గంగవరం పోర్టు వంటి సంస్థలు పైపులైన్ల నిర్మాణాలకు అనుమతులివ్వక పోవటాన్ని ఈ జాప్యానికి కారణంగా చెప్పారు. నోడల్ ఏజన్సీ ఈ ప్రాజెక్టును పూర్తి చేసినట్టు తెలిపింది (2012 డిసెంబరు.

ఇంతే కాకుండా, ఇళ్ళకు నీటి కనెక్షన్లు ఇచ్చి మీటర్లు అమర్చవలసిన బాధ్యత గుత్తేదారుదికాగా, ఎర్రిగడ్డ కాలనీలోని కొన్ని ప్రాంతాలలో ఇళ్ళకు జీవీఎమ్‌సీ కనెక్షన్లు ఇచ్చి, మీటర్లు అమర్చి (300) వాటి ఖరీదును ఇంటి యజమానుల నుంచి వసూలు చేసింది. వీటికి సంబంధించిన తుది చెల్లింపులు చేసే సమయంలో ఈ విషయం దృష్టిలో ఉంచుకోవాలి. ఇందుకు ప్రభుత్వం సమాధానమిస్తూ (2012 డిసెంబరు), ఇందులో నష్టమేదైనా జరిగి ఉంటే గుర్తించి తమకు నివేదించవలసిందిగా జీవీఎమ్‌సీ, నోడల్ సంస్థలను అడిగినట్లు పేర్కొంది.

### 4.7.5.8 ఇతర ప్రాజెక్టులు

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ఆడిట్ పరిశీలనలు | 2012 జూన్ నాటికి వ్యయం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 1 | ధోన్ నీటి సరఫరా పథకం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹44.76 కోట్లకు మంజూరు చేశారు. కానీ, స్థల సేకరణలోని జాప్యం వలన పనులు పూర్తి కాలేదు. అటవీ శాఖ నుంచి అనుమతి పొందడంలోని జాప్యాన్ని ప్రభుత్వం అంగీకరించి, ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకోవలసి ఉన్నందున అక్కడి రైతులు, నీటి వినియోగ సంఘాలు వ్యతిరేకించటంతో పనులకు అవరోధం ఏర్పడిందని కూడా పేర్కొంది (2012 డిసెంబరు). | 36.01 |
| 2 | పిఠాపురం నీటి సరఫరా పథకం | ఈ ప్రాజెక్టులను 2008-09లో ₹126.65 కోట్లకు మంజూరు చేశారు. పిఠాపురం, రామచంద్రాపురం ప్రాజెక్టులు స్థల సేకరణలోని జాప్యం వలన అసంపూర్తిగా ఉన్నాయి. డిజైన్లు ఖరారు చేయటంలోని ఆలస్యానికీ ఇది కారణమయ్యింది. అంతేకాకుండా, ఈ నాలుగు ప్రాజెక్టులనూ శాశ్వతమైన నీటి వనరు చూసుకోకుండానే మొదలు పెట్టారు. రామచంద్రాపురం నీటి సరఫరా పథకానికి నీటిని గ్రహించేందుకు అనుమతి లభించిందనీ (2012 ఏప్రిల్), మిగతా పథకాలకూ ప్రయత్నాలు చేస్తున్నామనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). | 8.81 |
| 3 | రామచంద్రాపురం నీటి సరఫరా పథకం | | 9.66 |
| 4 | ధర్మవరం నీటి సరఫరా పథకం | | 53.43 |
| 5 | నిజామాబాద్ నీటి సరఫరా పథకం | | 41.61 |
| 6 | కామరెడ్డి నీటి సరఫరా పథకం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹22.35 కోట్లకు మంజూరు చేశారు. ఐతే, జల వనరుల్లో నీటి కొరత కారణంగా, ఆశించిన 15.97 ఎమ్ఎల్‌డీ స్వచ్ఛమైన నీటి సరఫరాకు భరోసాలేదు. గ్రామీణ నీటి సరఫరా శాఖ 10 ఎమ్ఎల్‌డీ నీటిని ఇవ్వటానికి మాత్రమే అంగీకరించిందనీ, దీనివలన నీటిని శుద్ధి చేసేందుకు ₹8.21 కోట్ల అంచనా వ్యయంతో అదనపు ఏర్పాట్లు అవసరమవుతాయనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). | 15.33 |

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | ఆడిట్ పరిశీలనలు | 2012 జూన్ నాటికి వ్యయం (₹ కోట్లలో) |
|---|---|---|---|
| 7 | వరంగల్ నీటి సరఫరా పథకం | ఈ ప్రాజెక్టును 2006-07లో ₹164.46 కోట్లకు మంజూరు చేశారు. సంప్, పంప్‌హౌస్‌ల నిర్మాణానికి అవసరమయ్యే స్థల సేకరణలో జాప్యం, కేయూసీ సమీపంలోనూ, దేశాయిపేటలోనూ, కాకతీయ కాలువ నుంచి అదనపు నీటిని గ్రహించేందుకు నీటి పారుదలశాఖ అనుమతించటంలోని జాప్యం, విద్యుత్ కనెక్షన్లు తీసుకోవటంలో జాప్యం వలన ఈ ప్రాజెక్టు ఆలస్యమయింది. నోడల్ ఏజన్సీ 2012 డిసెంబరులో ఇచ్చిన సమాచారం మేరకు ప్రాజెక్టు పూర్తయింది.<br>ఈ ప్రాజెక్టు 2036 సంవత్సరపు జనాభా అవసరాలను కూడా తీర్చే విధంగా రూపకల్పన చేశారు. కానీ, దేశాయిపేట డివిజన్‌కు నీటి కేటాయింపు భావి అవసరాలకు సరిపడినంతగా లేదు. ఇప్పటికే అందుబాటులో ఉన్న వడపోత కేంద్రం, ఈ పథకం కింద నెలకొల్పిన ప్లాంటు కలిసి 78.19 ఎమ్ఎల్‌డీ సామర్థ్యం కలిగి ఉన్నాయనీ, ఇవి దేశాయిపేట జోన్ అవసరాలకు 2021 వరకూ సరిపోతాయనీ ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). ఐతే, వరంగల్ డబ్ల్యూఎస్ఐఎస్ ఫీడర్ మెయిన్స్‌కు సంబంధించిన డిజైన్లకు జతచేసిన నివేదికలో సూచించినదాని ప్రకారం దేశాయిపేట డివిజనుకు భావి అవసరాలకు 94.54 ఎమ్ఎల్‌డీ నీరు అవసరమవుతుంది. ఆవిధంగా ప్రభుత్వ సమాధానం ఆమోదయోగ్యంకాదు. | 164.00 |
| 8 | తణుకు నీటి సరఫరా పథకం | ఈ ప్రాజెక్టును 2008-09లో ₹14.14 కోట్లకు ఆమోదించారు. కానీ, వేసవి నీటి నిల్వ చెరువుకు స్థలం లభించక పనులు పూర్తవలేదు. | 11.53 |
| 9 | మంచిర్యాల నీటి సరఫరా పథకం | ఈ పథకాన్ని 2006-07లో ₹22.87 కోట్లకు ఆమోదించారు. ఐతే, నీటి పంపింగ్ మెయిన్ నిర్మాణానికి స్థలం గుర్తించనందువలనా/ మార్చినందువలనా, పనుల్లో చోటు చేసుకున్న మార్పుల వలనా ప్రాజెక్టు పూర్తికాలేదు. | 22.23 |
| 10 | నారాయణపేట నీటి సరఫరా పథకం | శ్రీ సత్యసాయి నీటి సరఫరా ప్రాజెక్టు నుంచి 6 ఎమ్ఎల్‌డీ నీటిని సరఫరా చేయవలసి ఉండగా, కేవలం 1.5 ఎమ్ఎల్‌డీ నీటిని మాత్రమే సరఫరా చేశారు (2009 జూలై). పంపుసెట్ల మీద అదనపు వ్యయం, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపుదల ఖర్చు ₹2.05 కోట్లు చెల్లించనందువల్ల మిగతా 4.5 ఎమ్ఎల్‌డీ నీటి సరఫరాను సత్యసాయి నీటి సరఫరా బోర్డు ఆపేసింది. తొలి అంచనాలలో ఈ ₹2.05 కోట్లను పేర్కొనలేదనీ, ట్రాన్స్‌ఫార్మర్ల ప్రస్తుత ధర తెలుపమని బోర్డు అధికారులను అడుగుతున్నామనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు). | 6.74 |

## 4.7.6 పట్టణ రవాణా

### *4.7.6.1 విశాఖపట్నంలో బస్సు శీఘ్ర రవాణా వ్యవస్థ*

ఈ ప్రాజెక్టును ₹452.93 కోట్ల అంచనా వ్యయంతో 2007 నవంబరులో ఆమోదించారు. జీవీఎమ్‌సీ అమలు చేసే ఈ ప్రాజెక్టులో 43.36 కి.మీ. అవిచ్ఛిన్న మార్గాలతో బస్ శీఘ్ర రవాణా విస్తృతి అభివృద్ధి చేస్తారు. ఇందులో అంతర్భాగాలుగా పెందుర్తి ట్రాన్సిట్ కారిడార్ (21.62 కిమీ), సింహాచలం ట్రాన్సిట్ కారిడార్ (20.12 కిమీ),

ఆసిల్‌మెట్టలో ఒక పైదారి (1.62 కిమీ) ఉంటాయి. ఈ ప్రాజెక్టు 2010 అక్టోబరుకల్లా పూర్తికావలసి ఉంది. ఐతే, రక్షణ శాఖ, రైల్వేలు, సింహాచలం దేవస్థానంలనుంచి అనుమతులు రాకపోవటం, ప్రైవేటు వ్యక్తుల నుంచి స్థల సేకరణలో జాప్యం, ఆలయాలను తరలించవలసి రావటం వంటి కారణాలవలన ఈ ప్రాజెక్టు అసంపూర్తిగానే మిగిలింది. అంతే కాకుండా, స్థల వివాదాలు పరిష్కరించటంలోని ఆలస్యం వలన నిర్మాణ వ్యయం ₹3.64 కోట్లు పెరిగింది.

ప్రభుత్వం ఈ జాప్యాన్ని అంగీకరిస్తూ, దేవాదాయ శాఖతో సంప్రతింపులు జరుగుతున్నామని తెలిపింది (2012 డిసెంబరు).

## 4.7.7 గృహనిర్మాణం, మౌలిక వసతులు

గృహ నిర్మాణం, మౌలిక వసతులకు సంబంధించి 2005-09 సంవత్సరాలలో ₹4209 కోట్ల ఆమోదిత వ్యయంతో మంజూరైన 113 ప్రాజెక్టులలో 22 ప్రాజెక్టులు మాత్రమే పూర్తయినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). వీటినుంచి 2005-08లో మంజూరైన ఐదు ప్రాజెక్టులను (వీటి ఆమోదిత వ్యయం ₹1119 కోట్లు) ఆడిట్ సమగ్ర పరిశీలన కోస ఎంపిక చేసింది. వీటిమీద ₹1159 కోట్లు ఖర్చు చేసినాగానీ 2012 జూన్ నాటికి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తికాలేదు. ఈ ఐదు ప్రాజెక్టుల పరిశీలనలో ఆడిట్ గమనించిన విషయాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

### *4.7.7.1 సమీకృత గృహ నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి పథకం, హైదరాబాద్ (49,000 ఇళ్ళు), హైదరాబాద్‌లో 4550 ఇళ్ళ నిర్మాణం, మౌలిక వసతులకల్పన*

హైదరాబాద్‌లో మచ్చుకు తనిఖీ చేసిన బీఎస్‌యూపీ ప్రాజెక్టులు రెండింటి సంక్షిప్త సమాచారం ఈ దిగువ ఇవ్వబడింది.

పట్టిక 4.5

| వివరాలు | సమీకృత గృహ నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి పథకం, హైదరాబాదు (49000 ఇళ్ళు) | హైదరాబాదులో 4550 ఇళ్ళ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన |
|---|---|---|
| పాలనాపరమైన అనుమతి | 2006 మార్చి | 2008 ఫిబ్రవరి |
| అంచనా వ్యయం | ₹490 కోట్లు | ₹120.33 కోట్లు |
| నిర్మాణ సంస్థలు | జీహెచ్ఎమ్‌సీ (23239 ఇళ్ళు), ఏపీహెచ్‌బీ (25761 ఇళ్ళు) | జీహెచ్ఎమ్‌సీ (4550 ఇళ్ళు) |
| బిడ్ విధానం | నామినేషన్ విధానం | వేలం విధానం |
| పనులప్పగించిన తేదీ | 2006 మార్చి నుంచి 2008 డిసెంబరు వరకు | 2008 మే నుంచి 2010 ఆగస్టు వరకు |
| పనులు దక్కించుకున్న సంస్థలు | 45 ప్యాకేజీలుగా విభజించి, 31 మంది గుత్తేదారులకి ఇచ్చారు (13793 ఇళ్ళ నిర్మాణానికి) (మిగతా ఇళ్ళ సమాచారం ఇవ్వలేదు) | 15 ప్యాకేజీలుగా విభజించి 9 మంది గుత్తేదారులకు ఇచ్చారు |
| పూర్తిచేయ వలసిన తేదీ | ఒక్కొక్క ప్యాకేజీకి వేరువేరుగా ఉంది | 2008 నవంబరు నుంచి 2010 నవంబరు వరకు |
| ప్రస్తుత పరిస్థితి | 25761 ఇళ్ళ ప్రాజెక్టు పూర్తి చేసింది (ఏపీహెచ్‌బీ) 23239 ఇళ్ళ ప్రాజెక్టు పూర్తికావలసి ఉంది (జీహెచ్ఎమ్‌సీ) | పూర్తికాలేదు |

*మూలం : ప్రాజెక్టు దస్త్రాలు*

*గమనిక : తొలుత 23239 ఇళ్ళ ప్రాజెక్టును 2005లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ (ఏపీఎస్‌హెచ్‌సీఎల్)కు అప్పగించి, తరువాత 2007 జూలై నెలలో జీహెచ్ఎమ్‌సీకి బదిలీచేసి, ఆపై 2009 ఆగస్టులో పాక్షికంగా ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ బోర్డు (ఏపీహెచ్‌బీ)కి ఇచ్చారు. ఈ మార్పులకు కారణాలు రికార్డులలో కనిపించలేదు*

సమగ్ర నివేదికలలో సూచించినట్లు ఈ ప్రాజెక్టులు 2008 మార్చి, 2009 జూన్‌లలో పూర్తి కావలసి ఉండగా, ఇవి రెండూ 2012 జూన్ నాటికి అసంపూర్తిగానే ఉన్నాయి. ఆ వివరాలు ఈ దిగువ పట్టికలో చూడవచ్చును

పట్టిక 4.6

| పథకం పేరు | పూర్తయిన ఇళ్ళు | కేటాయించిన ఇళ్ళు | స్వాధీనం చేసుకున్న ఇళ్ళు | కేటాయించినా స్వాధీనం చేసుకొనని ఇళ్ళు |
|---|---|---|---|---|
| **49000 ఇళ్ళు** | 45027 | 36462 | 25971 | 10491 |
| **4550 ఇళ్ళు** | 2534 | 75 | 35 | 40 |

*మూలం : జీహెచ్ఎమ్సీ ఇచ్చిన సమాచారం*

## *ప్రత్యక్ష పరిశీలన, లబ్ధిదారుల అధ్యయనం*

- బన్సీలాల్‌పేటలో 48, గొల్లకొమరయ్య కాలనీలో 40 ఇళ్ళు నిర్మించాలని అనుకోగా, జీహెచ్ఎమ్సీ వీటిలో 42 (2010 ఏప్రిల్), 32 (2010 మే) ఇళ్ళు మాత్రమే నిర్మించింది. లబ్ధిదారులను గుర్తించటంలోని ఇబ్బందుల వలన ఈ ఇళ్ళను ఎవరికీ కేటాయించలేదు. ఐతే, ఆడిట్ బృందం ఇళ్ళను ప్రత్యక్షంగా పరిశీలించినప్పుడు (2011 మే 9) ఇలాపూర్తయిన ఇళ్ళలో కొందరు కేటాయింపులు జరగకుండానే, తమ వంతు చెల్లింపులు చేయకుండానే అనధికారికంగా నివసిస్తున్నారని తెలిసింది. లబ్ధిదారుల వాటాను వసూలు చేసుకొని, వారికి యాజమాన్యపు హక్కులు అధికారికంగా కల్పిస్తామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు).

- ఏపీహెచ్‌బీ ఇదివరకే స్వాధీనం చేసిన ఇళ్ళను లబ్ధిదారులు పూర్తిగా ఆక్రమించుకొనకపోవటానికి ప్రధాన కారణం ప్రాథమిక వసతుల లోపమేనని కలెక్టర్ కార్యాలయంలోని దస్త్రాలవలన తెలిసింది. ఇక్కడ వేయవలసిన 570 ఆర్ఎమ్‌టీ తాగునీటి పైపులైను పని స్థలసేకరణలోని అడ్డంకులవలన సాగటంలేదు. ఇక్కడ నివసిస్తున్నవారు ట్యాంకర్ల ద్వారా అందే నీటిపైనే ఆధారపడుతున్నారు. ఆడిట్ అధికారులు 2011 ఆగస్టు 9న నిర్వహించిన లబ్ధిదారుల అధ్యయనంలో కూడా ఈ విషయం ధృవపడింది. ప్రభుత్వం ఈ వాస్తవాలను అంగీకరిస్తూ (2012 డిసెంబరు), తాగునీటి సరఫరాకు తగినన్ని ట్యాంకర్లు సమకూర్చామని తెలిపింది.

- అహమ్మద్‌గూడ కాలనీలో 3809 ఇళ్ళకుగాను 1255 ఇళ్ళలో మాత్రమే లబ్ధిదారులు ఉంటున్నారు. ఈ కాలనీకి 3/4 కి.మి. దూరంలోని చెత్తకుప్పనుంచి వచ్చే పొగ, దుర్వాసనల వలన ఈ పరిస్థితి నెలకొంది. (పక్కన ఉన్న ఛాయాచిత్రం) ఆడిట్ బృందం 2011 ఆగస్టు 13న చేపట్టిన ప్రత్యక్ష పరిశీలన, లబ్ధిదారుల అధ్యయనంలో ఈ విషయం ధృవపడింది. ఇప్పుడు 1700 మంది ఇళ్ళను ఆక్రమించు కున్నారని చెబుతూ, చెత్త నిర్మూలన వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు చర్యలు ఆరంభించామని తెలిపింది (2012 డిసెంబరు).



*అహమ్మద్‌గూడ కాలనీ సమీపంలోని చెత్తకుప్ప*

### *4.7.7.2 కృష్ణానది, బుడమేరు వరద బాధితులకు వీఎమ్‌సీ పరిధిలో పునరావాస గృహాలు, వీయమ్‌సీ సర్కిల్ - Iలోని మురికివాడలలో జీ+3 సామూహిక గృహనిర్మాణం*

మచ్చుకు తనిఖీ చేసిన బీఎస్‌యూపీ ప్రాజెక్టు రెండింటి సంక్షిప్త సమాచారం ఈ కింది విధంగా ఉన్నది.

**పట్టిక 4.7**

| వివరాలు | కృష్ణానది వరద బాధితులకు 15000 గృహాలు | బుడమేరువాగు వరద బాధితులకు 6752 గృహాలు |
|---|---|---|
| పాలనాపరమైన అనుమతి | 2006 సెప్టెంబరు | 2007 అక్టోబరు |
| అంచనా వ్యయం | ₹258.74 కోట్లు | ₹190.88 కోట్లు |
| నిర్మాణ సంస్థ | వీఎమ్‌సీ | వీఎమ్‌సీ |
| బిడ్ విధానం | వేలం ద్వారా | వేలం ద్వారా |
| పనులు అప్పగించిన తేదీ | 2007 ఏప్రిల్, 2010 సెప్టెంబరు మధ్యన | 2008 ఆగస్టు, 2011 మార్చి మధ్యన |
| పనులను దక్కించుకున్న సంస్థలు | 127 ప్యాకేజీలుగా విభజించి, అన్నింటినీ అప్పగించారు | 120 ప్యాకేజీలుగా విభజించి, 2011 జూన్ నాటికి 90 ప్యాకేజీలు అప్పగించారు |
| పూర్తికావలసిన తేదీ | 2007 సెప్టెంబరు నుంచి 2011 ఫిబ్రవరి వరకు | 2008 నవంబరు నుంచి 2011 జూన్ వరకు |
| ప్రస్తుత పరిస్థితి | పూర్తికాలేదు | పూర్తికాలేదు |

*మూలం: ప్రాజెక్టు దస్త్రాలు*

*గమనిక: హైదరాబాద్‌లో మచ్చుకు తనిఖీ చేసిన బీఎస్‌యూపీ ప్రాజెక్టుల మాదిరిగానే విజయవాడ బీఎస్‌యూపీ ప్రాజెక్టులు రెంటిలోనూ పనులను రాష్ట్ర ప్రభుత్వం తొలుత ఏపీఎస్‌హెచ్‌సీఎల్‌కు అప్పగించి (2006), తర్వాత 2007 జూలైలో వీఎమ్‌సీకి బదిలీ చేసింది (కొద్ది భాగాన్ని ఏపీఎస్‌హెచ్‌సీఎల్ అట్టిపెట్టుకున్నాక). ఈ పనులను 2007 జూలైలో చేసిన నిర్ణయాల ప్రకారం పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా, ఈ మార్పులకు గల కారణాలు దస్త్రాలలో లభించలేదు*

అవసరమైనంత స్థలాన్ని పూర్తిస్థాయిలో సేకరించలేకపోవటంతో ఈ రెండు ప్రాజెక్టులూ అసంపూర్తిగానే ఉన్నాయి.

- "కృష్ణానది, బుడమేరువాగు వరదబాధితులకు వీఎమ్‌సీలో 15000 ఇళ్ళ నిర్మాణం" ప్రాజెక్టుకు 108.38 ఎకరాల స్థలం అవసరంకాగా, వీఎమ్‌సీ తన పరిధిలో 17.15 ఎకరాలను, జక్కంపూడిలో 87.55 ఎకరాలను మాత్రమే సేకరించింది.
- "వీఎమ్‌సీ సర్కిల్ - Iలోని మురికివాడలలో జీ+3 సామూహిక గృహ నిర్మాణ" పథకంలో 68.20 ఎకరాల స్థలం అవసరంకాగా కేవలం 9 ఎకరాలు అందుబాటులో ఉంది. ఫలితంగా, వీఎమ్‌సీ తలపెట్టిన 6752 ఇళ్ళకుగాను 832 ఇళ్ళనే నిర్మించింది. వీఎమ్‌సీ ఇచ్చిన స్టేటస్ నివేదికను బట్టి చూస్తే మిగతా స్థలాన్ని జక్కంపూడి దగ్గరి గొల్లపూడిలో సేకరించే అవకాశాలు చాలా తక్కువ.

నిర్మాణ సంస్థలను మార్చటం, స్థల సేకరణలోని జాప్యం మూలంగా ఖర్చు ₹172.62 కోట్లు పెరిగింది. ఈ భారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పట్టణ స్థానిక సంస్థ వహించవలసి ఉంటుంది. వ్యయంలో పెరుగుదల 15,000 ఇళ్ళ ప్రాజెక్టుకు ₹258.74 కోట్ల నుంచి ₹373.55 కోట్లకు; 6,752 ఇళ్ళ ప్రాజెక్టుకు ₹190.88 కోట్ల నుంచి ₹248.69 కోట్లకు ఉంటుంది.

ఇళ్ళ నిర్మాణంలో 2012 జూన్ నాటి పరిస్థితి ఈ దిగువ విధంగా ఉంది.

**పట్టిక 4.8**

| పథకం పేరు | పూర్తయిన ఇళ్ళు | కేటాయించిన ఇళ్ళు | స్వాధీనం చేసుకున్న ఇళ్ళు | కేటాయించినా స్వాధీనం చేసుకోని ఇళ్ళు |
|---|---|---|---|---|
| 15000 ఇళ్ళు | 12480 | 8013 | 6760 | 1253 |
| 6752 ఇళ్ళు | 832 | 0 | 0 | 0 |

*మూలం : వీఎమ్‌సీ రికార్డులు*

ఏపీఎస్‌హెచ్‌సీఎల్ చేపట్టిన 1056 ఇళ్ళ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించినా ఒకే ఏజన్సీకి అప్పగించారు (2007 మే/జూన్). ఈ పనులు ₹18.51 కోట్ల వ్యయంతో 2008 నవంబరు/డిసెంబరులో పూర్తి చేయాల్సిఉంది. ఐతే, పనులు నాసిరకంగా ఉండటంతో 2008 డిసెంబరులో గుత్తేదారుని తప్పించి (అప్పటికే ₹1.77 కోట్ల విలువైన 10 శాతం పనులు పూర్తయ్యాయి), ఆ తదుపరి ఏపీఎస్‌హెచ్‌సీఎల్ స్వయంగా నిర్మాణం చేపట్టింది.

ప్రాజెక్టును ఏపీహెచ్‌ఎస్‌సీఎల్ నుంచి వీఎమ్‌సీకి బదిలీ చేయటంతో పనుల్లో జాప్యం చోటు చేసుకుందనీ, తొలి విడత టెండర్లకు స్పందన రాకపోవటమే ఖర్చుల్లో పెరుగుదలకు కారణమనీ ప్రభుత్వం ఆపాదించింది (2012 డిసెంబరు).

### 4.7.7.3 తిరుపతిలో 4087 ఇళ్ళ నిర్మాణం, వసతుల కల్పన (ఐహెచ్‌ఎస్‌డీపీ)

ఈ ప్రాజెక్టును 2007 మే నెలలో ఆమోదించారు. దీని అంచనా వ్యయం ₹55.36 కోట్లు (గృహ నిర్మాణానికి ₹40.87 కోట్లు; వసతులకు ₹14.49 కోట్లు)కాగా దీనిని అవిలాల, దామినీడు అనే రెండు ప్రాంతాలలో చేపట్టవలసి ఉంది. ఈ ప్రాజెక్టును 89 పనులుగా విభజించి 14 మంది గుత్తేదారులకు 2008మే, 2009 మార్చి నెలల మధ్యన అప్పగించారు. పనులు 2008 నవంబరు, 2011 మార్చి మధ్యన పూర్తి చేయాలని చెప్పారు. ఈ నిర్మాణాలకు సంబంధించి ఆడిట్ గమనించినవి ఈ విధంగా ఉన్నాయి.

- నిర్మించవలసిన 4087[34] ఇళ్ళకుగాను, 2012 జూన్ నాటికి అవిలాలలో ఒక్క యూనిట్ కూడా పూర్తి కాలేదు. దామినీడులో 528 ఇళ్ళు పూర్తవగా, ఇందులో 456 ఇళ్ళు కేటాయించారు. వాటిలో 124 ఇళ్ళు మాత్రమే లబ్ధిదారులు ఆక్రమించుకున్నారు. మిగతా 332 ఇళ్ళకు సంబంధించి, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి 2012 సెప్టెంబరులో ఇళ్ళకు తీగలు వేశామని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). ఐతే, వీటిలో ఎన్ని ఇళ్ళను లబ్ధిదారులు స్వాధీనం చేసుకున్నదీ తెలుపలేదు.
- బ్యాంకు ఋణాలకు వెసులుబాటు కల్పించటం టీఎమ్‌సీకి సాధ్యపడకపోవటంతో నిర్మాణం పూర్తి చేసుకున్న అనేక ఇళ్ళను లబ్ధిదారులు స్వాధీన పరుచుకోనలేదు. నిధుల సర్దుబాటుకు సంబంధించి, నిర్మాణ సంస్థ సరికొత్త ప్రతిపాదనలతో ముందుకు రావాలని ప్రభుత్వం పేర్కొంది (2012 డిసెంబరు).

## 4.7.8 అతిక్రమణలు

సమగ్ర ప్రాజెక్టు నివేదికల ఆధారంగా ఆమోదించిన అంచనాల మేరకు ప్రాజెక్టు పనులు నిర్వహించాలి. పనులు ప్రారంభించేముందు విస్తృతమైన సర్వే, పరిశోధన జరగాలి. ఈ కింద ప్రాజెక్టుల రికార్డులు పరిశీలించగా సమగ్ర నివేదికలలో సూచించిన పరిధి నుంచి అతిక్రమణలు, లీడ్ చార్జీలను తప్పుగా లెక్కించటం, బిల్ ఆఫ్ క్వాంటిటీస్‌లో మట్టి కోసం కేటాయింపులు చేయటం, డిజైన్లలో మార్పులు వంటివి బయటపడ్డాయి.

### 4.7.8.1 ఒకటవ మండలంలో మూసీ నదికి దక్షిణాన పాతబస్తీలో మురుగు నీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ (ఎస్1 నుంచి ఎస్6, ఎస్12, ఎస్14) ఆయకట్టు ప్రాంతాలు

అనుబంధ, అధికృత అదనపు పనులను ₹32 కోట్ల వ్యయంతో జలమండలి చేపట్టింది (నేలస్వభావం, మట్టి స్వభావంలో తేడాలవలన అని చెప్పారు). మొత్తం పనుల అంచనా వ్యయం ₹60.38 కోట్లలో[35] ఇది 53 శాతంపైగా ఉన్నది. ఇది 10 శాతం పరిమితికన్నా చాలా ఎక్కువ. ప్రణాళికాలోపం, స్థల పరిశీలనలోని లోపాలను ఇది సూచిస్తుంది. పనులకు అంచనాలు రూపొందించి, ఒప్పందంకుదుర్చుకొనేముందే వీటిని సరిచూసుకుని ఉండాల్సింది. పనుల్లో ఏర్పడిన అవరోధాలను పరిశీలించి తదుపరి చర్య తీసుకుంటామని ప్రభుత్వం పేర్కొంది (2012 డిసెంబరు).

[34] టీఎమ్‌సీ 4056 ఇళ్ళ నిర్మాణానికి మాత్రమే బిడ్లు ఆహ్వానించింది

[35] అంచనా వ్యయంమీద చెప్పిన టెండరు ప్రీమియంకాకుండా

### *4.7.8.2 శేరిలింగంపల్లి మునిసిపాలిటీలో మురుగునీటి బృహత్ ప్రణాళిక*

- రెండవ ప్యాకేజీలో ఎస్‌డబ్ల్యూజీ పైపులను సమగ్ర ప్రాజెక్టు నివేదికలో అనుకున్న వాటికన్నా బాగా హెచ్చు వ్యాసంగలవి వేయాల్సివచ్చింది. ఈ విధంగా 200 ఎమ్‌ఎమ్, 250 ఎమ్‌ఎమ్, 300 ఎమ్‌ఎమ్ వ్యాసంగల గొట్టాల పరిమాణాలలో 462 శాతం, 257 శాతం, 56 శాతం పెరుగుదల ఉన్నది. స్థల స్వభావాన్ని అనుసరించి, శేరిలింగంపల్లి మునిసిపాలిటీలోని జన సమ్మర్ద ప్రాంతాల అవసరాలను తట్టుకునే విధంగా 150 ఎమ్‌ఎమ్ బదులుగా 200 ఎమ్‌ఎమ్ వ్యాసంగల గొట్టాలు వాడినట్టు ప్రభుత్వ శాఖ తెలిపింది. ఐతే, తొలి నివేదికలలో 2041 సంవత్సరపు అవసరాలను ప్రామాణికంగా తీసుకుని అంచనాలు రూపొందించిన నేపథ్యంలో ఇది సముచితంగా లేదు. విషయం పరిశీలించి తదుపరి చర్య గైకొనగలమని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

- బివర్లీహిల్స్, మాదాపూర్‌లలోని రెండు ప్రధాన ఆయకట్టు ప్రాంతాలకు మురుగునీటి లైన్లు ₹73.90 కోట్ల అంచనా వ్యయంతో వేయాలని సమగ్ర ప్రాజెక్టు నివేదికలో పొందుపరిచినా, ఈ పనులను ప్యాకేజీలుగా విభజించి పనులప్పగించే సమయంలో జలమండలి వీటిని పనిపరిధి నుంచి తప్పించింది. ఈ ఆయకట్టు ప్రాంతాలలో పనులు ఇదివరకే 2007 నవంబరులో హెచ్‌ఎమ్‌డీఏ నుంచి పాక్షిక సాయంతో మొదలు పెట్టారనీ, సమగ్ర ప్రాజెక్టు నివేదికను కేంద్ర ప్రభుత్వం ఆమోదించేసరికి పనులు పూర్తి స్థాయిలో సాగుతున్నాయనీ ఆడిట్ గమనించింది. ఐతే, ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు ఈ ప్రాంతంలో వెంటనే సౌకర్యాలు కల్పించేందుకు పనులు మొదలు పెట్టారని ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఆమోదానికి ముందే పనులారంభించారు కనుక ఇది జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ విధానాలకు విరుద్ధమైనది. కాబట్టి ఈ సమాధానం ఆమోదయోగ్యంకాదు.

- ఎస్ఎస్ఆర్‌కు చేసిన రెండు వార్షిక సవరణల (2007-08, 2008-09) కారణంగా ప్యాకేజీ - III అంచనా విలువను (₹34 కోట్లు) జలమండలి అంచనా వ్యయానికి (₹11 కోట్లు) మూడు రెట్లు పెంచింది. పనులను మరికొన్ని ప్రాంతాలకు విస్తరించటం కూడా సవరణలకు కారణమయ్యిందని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). ఐతే, ఆ వివరాలు మాత్రం తెలుపలేదు.

### *4.7.8.3 రెండవ మండలంలో మూసీనదికి దక్షిణాన పాత బస్తీలో మురుగునీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ (ఎస్7 నుంచి ఎస్11, ఎస్13, ఎస్15)*

అసలు ప్రాజెక్టు నివేదికలో చెప్పిన వాటికంటే భారీ వ్యాసంగల పైపులను వాడారు. వీటిలో 150 ఎమ్‌ఎమ్, 250 ఎమ్‌ఎమ్ బదులు 200 ఎమ్‌ఎమ్, 300 ఎమ్‌ఎమ్ వ్యాసంగల గొట్టాలను వాడటం వలన 80 శాతం నుంచి 187 శాతం వరకూ పెరిగింది. స్థానికప్రజాప్రతి నిధుల విజ్ఞప్తి మేరకూ, స్థల స్వభావాన్ననుసరించీ పెద్ద పైపులను వాడినట్టు ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). ఇది ప్రణాళికాలోపాన్ని సూచిస్తుంది.

### *4.7.8.4 పాత ఎమ్‌సీహెచ్‌లోని 10 జోన్లలో పంపిణీ వ్యవస్థతోపాటు ఫీడర్ వ్యవస్థ పునరుద్ధరణ*

- 600 ఎమ్‌ఎమ్ వ్యాసంగల ఎమ్‌ఎస్ పైపు 1000 ఆర్ఎమ్‌టీ బదులు 1630 ఆర్ఎమ్‌టీ వేయటం వలన మట్టి తవ్వకం, రాతి తవ్వకం, కంకర, బెండ్ల వాడకం పెరిగి ₹90.86 లక్షల అదనపు వ్యయానికి దారితీసింది.

  ఫీల్డ్ రిపోర్టు ప్రకారం పనులు జరగలేదనీ, జలమండలి నుంచి వివరణ తెప్పించుకుని తదుపరి చర్యలు తీసుకుంటామనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

- తవ్వినమట్టి తరలింపునకు 5 కి.మీ.కుగాను 10 కి.మీ. రేట్లను వేసి అంచనాలు తప్పుగా రూపొందించారు. పనులు మొత్తం పూర్తయ్యేసరికి దీని వలన ₹29.96 లక్షల అదనపు భారం పడుతుంది.

ఇప్పటికే ₹11.23 లక్షలు మినహాయించామనీ, మిగతా మొత్తాన్నీ వసూలు చేస్తామనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

- తవ్వి తీసిన మట్టిని గుంటలు పూడ్చేందుకు వినియోగించటం సాధారణంగా అనుసరించే విధానం. ఐతే, ఇక్కడ అందుబాటులో ఉన్నమట్టి పనికిరాదని చెబుతూ జలమండలి ఇందుకోసం విడిగా ₹2.23 కోట్లు కేటాయించింది.

  సిమెంట్ కాంక్రీటు రోడ్లు, తారు రోడ్ల శిధిలాలు మట్టితో కలిశాయని ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). ఐతే, ఈ శిధిలాలను విడిగా కుప్పవేసి మట్టిని మాత్రం వాడుకొని ఉండవచ్చును కనుక ఈ సమాధానం సరికాదు.

- మైశారం, ఆస్మాన్‌గఢ్, రెండు జోన్లలో ఇన్‌లెట్, ఔట్‌లెట్ పంపిణీ వ్యవస్థకు సంబంధించిన పనులకు సమగ్ర నివేదికలో పేర్కొన్న వ్యయానికీ (₹23.88 కోట్లు, ₹48.36 కోట్లు), గుత్తేదారుకి అప్పగించిన పనుల విలువకూ (₹51.99 కోట్లు, ₹16.78 కోట్లు) మధ్య భారీ వ్యత్యాసమున్నది.

  అదనపు రిజర్వాయర్లు, ఇతర అంశాల వలన ఈ వ్యత్యాసం ఏర్పడిందని ప్రభుత్వం బదులిచ్చింది (2012 డిసెంబరు). సమగ్ర ప్రాజెక్టు నివేదికలో అంచనాలను అవాస్తవికంగా రూపొందించటాన్ని ఇది స్పష్టం చేస్తుంది.

### *4.7.8.5 తాటిపూడి జలాశయం నుంచి పట్టణ పంపిణీ జలాశయం, పంపింగ్ యూనిట్ల వరకూ తాటిపూడి పైప్‌లైన్‌ను మార్చడం*

ప్యాకేజీ-3 కింద క్రిష్ణాపురం హెడ్‌వర్క్సుకు 1000 కేఎల్ సంప్-కం-పంప్‌హౌస్ నిర్మాణానికి ₹85 లక్షల తొలి అంచనాను జీవీఎమ్‌సీ ₹134 లక్షలకు సవరించింది. స్థలం స్వభావాన్ని కారణంగా చూపుతూ ఈ సవరణకు ఆమోదం కూడా తెలిపింది (2009 మే). ప్రభుత్వం ఈ విషయాన్ని ధృవీకరించింది (2012 డిసెంబరు). తొలి అంచనాలు వాస్తవికంగా లేకపోవటాన్ని ఇది సూచిస్తుంది.

### *4.7.8.6 విజయవాడ నగరం ఉత్తర భాగంలో మురుగునీటి పారుదల వసతులు కల్పించటం*

మురుగునీటి పారుదల లైన్ల విస్తరణకు సంబంధించిన 25 పనులను (వీటి విలువ ₹23.79 కోట్లు) వీఎమ్‌సీ 2009-10లో చేపట్టింది. ఇవి సమగ్ర ప్రాజెక్టు నివేదిక పరిధిలోలేవు. అంతేకాకుండా, ప్రస్తుత సమగ్ర ప్రాజెక్టు నివేదికకు సంబంధించి సేకరణ వ్యవస్థలోని పనులు కొన్ని ₹33 కోట్ల అంచనా వ్యయంతో మరొక బీఎస్‌యూపీ ప్రాజెక్టు కింద చేపట్టారు. ఈ వ్యాఖ్యను ప్రభుత్వం అంగీకరించి (2012 డిసెంబరు), పైన పేర్కొన్న అతిక్రమణలను పొందుపరుస్తూ సమగ్ర నివేదికను సవరించామని చెప్పింది.

### *4.7.8.7 విజయవాడ నగరంలో నీటి సరఫరా లేని చోట సమకూర్చటం*

ఇన్‌టేక్ బావి డిజైన్లు మార్చటం, 50 ఎమ్‌ఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రం నిర్మాణపు అంచనాలను సవరించటం వలన వ్యయం ₹2.34 కోట్లు పెరిగింది. ఈ వ్యాఖ్యను ప్రభుత్వం ఒప్పుకుంది (2012 డిసెంబరు).

### *4.7.8.8 వరంగల్ నీటి సరఫరా పథకం*

నాణ్యతా నియంత్రణ పరికరాలు పెట్టుకోవటానికీ, నాణ్యత పరీక్షలు నిర్వహించటానికీ వీలుగా ప్రయోగశాలకోసం ఒక భవనం నిర్మించేందుకు ఐబీఎమ్‌లో ₹75 లక్షలు కేటాయించారు. ఆమేరకు ప్రభుత్వ శాఖ ₹82.42 లక్షలు వెచ్చించి, 10,000 చ. అడుగుల విస్తీర్ణంతో భవనం నిర్మించింది. ఐతే, ఈ భవనాన్ని సర్కిల్ కార్యాలయం, డివిజన్ (పీహెచ్) కార్యాలయాలకు వాడుకుంటున్నారు. ఇది సరికాదు.

ప్రయోగశాలకూ, దాని సిబ్బందికీ చోటు చూపించిన తరువాతే మిగిలిన స్థలంలో సూపరింటెండింగ్ ఇంజినీరు (పీహెచ్) సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). ఐతే, సర్కిల్ కార్యాలయం ఉపయోగించుకుంటున్న స్థలవైశాల్యం మాత్రం వివరించలేదు.

#### *4.7.8.9 రాయదుర్గం నీటి సరఫరా పథకం*

పునాదుల ట్రీట్‌మెంట్ కోసం అయ్యే ఖర్చుని ₹5.11 కోట్లుగా లెక్కకడుతూ (2009 మార్చి), మరింత లోతైన తవ్వకాలకోసం ప్రభుత్వ శాఖ ₹3.18 కోట్ల మొత్తాన్ని చేర్చి, అంచనాలను సవరించింది.

భారతీయ భూగర్భ పరిశోధనా సంస్థ (జీ ఎస్ఐ) సూచనపై పునాదుల ట్రీట్‌మెంట్ కోసం ఐబీఎమ్‌లో కూడా అదనపు చెల్లింపులకు కేటాయించారనీ, ఆ ప్రకారమే మరింత లోతైన తవ్వకానికి అయ్యే ఖర్చును లెక్కకట్టారనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు). పునాదుల ట్రీట్‌మెంట్ వ్యయాన్ని ఐబీఎమ్‌లో అంచనా వేసే ముందు అవసరమైన మట్టి పరీక్షలు నిర్వహించలేదని దీన్నిబట్టి తెలుస్తోంది.

### 4.7.9 గుత్తేదారుకు అనుచిత ప్రయోజనం

తొమ్మిది ప్రాజెక్టులకు సంబంధించిన పనుల్లోని బిల్లులను పరిశీలించగా గుత్తేదారులకు అధిక చెల్లింపులు, అనుచిత ప్రయోజనాలు కల్పించిన పలు దృష్టాంతాలు వెలుగుచూశాయి. అవి ఈ కింది విధంగా ఉన్నాయి :

- ఈపీసీ విధానంలో పనులప్పగించినప్పుడు ప్రధాన పనిని నిర్వహిస్తుండగా దానికి అనుబంధంగానూ, అనివార్యంగానూ అనిపించే పనులన్నీ గుత్తేదారుడే చేయాలి. ఐతే, ప్రధాన పనికి అనుబంధంగానూ, అవసరంగానూ ఉన్న పనులకోసం నిర్మాణ సంస్థలు అదే గుత్తేదారులతో అనుబంధ ఒప్పందాలు చేసుకొని వారికి అనుచిత ప్రయోజనం కల్పించాయి. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి :

| ప్రాజెక్టులు | ఆడిట్ గమనించినది |
|---|---|
| కడప మురుగునీటి పారుదల ప్రాజెక్టు | ఎక్కువగా నీరు ఊరుతున్న ప్రాంతాలలో ఎస్‌డబ్ల్యూజీ పైపులకు బదులుగా ఎన్‌పీ పీవీసీ-యూ పైపులు వేసేందుకు అదే గుత్తేదారుతో అనుబంధ ఒప్పందం కుదుర్చుకున్నారు (2009 మే).<br>ఎస్‌డబ్ల్యూజీ పైపులు వేయని భాగాలకు చెల్లింపులు చేయలేదుకాబట్టి గుత్తేదారుకు అనుచిత ప్రయోజనం ఇవ్వలేదని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు). ఐతే, అంతర్గత అంచనాలలో (ఐబీఎమ్) సూచించిన ఎస్‌డబ్ల్యూజీ పైపుల ధరను పరిగణనలోకి తీసుకున్న తరువాతే పైన పేర్కొన్న అదనపు భారం లెక్క కట్టిన దృష్ట్యా ఈ సమాధానం సరికాదు. |
| కరీంనగర్ మురుగునీటి పారుదల పథకం | నిర్మాణ సమయంలో పాడయిన ప్రజాసౌకర్యాలను, సంపదలను తిరిగి బాగు చేయటం, వివిధ శాఖల నుంచి అన్ని అనుమతులూ సంపాదించుకోవటం గుత్తేదారు పనిపరిధిలోకే వస్తున్నాగానీ, రోడ్డు తవ్వకాలకూ, పైపులైనులు వేసేందుకూ అనుమతుల కోసం నిర్మాణ సంస్థ రహదారులు, భవనాల శాఖకు ₹43.00 లక్షలు ధరావతుగా చెల్లించింది. ఒప్పందం ప్రకారం దీనిని గుత్తేదారు (రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్) నుంచి వసూలు చేయవలసి ఉంది. |
| ఏలూరు, ధర్మవరం, పిఠాపురం, మంచిర్యాల, ఒంగోలు నీటి సరఫరా పథకాలు | విద్యుత్ కనెక్షన్ పనులకోసం ఐబీఎమ్‌లో కేటాయింపు చేయటంతో ఈపీసీ నిబంధనలకు విరుద్ధంగా గుత్తేదారుకు ₹1.19 కోట్ల అనుచిత ప్రయోజనం కలిగింది. పథకం అమలు చేయటానికి అవసరమైన విద్యుత్ కనెక్షన్ ఖర్చును డిపార్టుమెంటు భరించాలని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 డిసెంబరు). ఐతే, ఏపీట్రాన్స్‌కో నుంచి అనుమతి తీసుకుని విద్యుత్తు కనెక్షన్ కోసం గుత్తేదారుడు తన సొంత ఏర్పాట్లు చేసుకోవాలని ఒప్పందంలోని 60వ క్లాజు స్పష్టం చేస్తున్నందున ఈ సమాధానం సరికాదు. |

| ప్రాజెక్టులు | ఆడిట్ గమనించినది |
|---|---|
| మంచిర్యాల నీటి సరఫరా పథకం | ఈపీసీ విధానంలో ₹24.72 కోట్లకు అప్పగించిన (2007 డిసెంబరు) ఈ పనుల్లో కాలినడక వంతెన నిర్మాణం కూడా ఒక భాగం. ఐతే, నిర్మాణక్రమంలో ఇన్‌టేక్ బావి స్థలమార్పిడి వలన అవసరమైన కాలినడక వంతెన నిర్మాణాన్ని అదనపు అంశంగా ₹2.92 కోట్లకు అదేగుత్తేదారుతో అనుబంధ ఒప్పందం కుదుర్చుకున్నారు.<br>మంచిర్యాల, మరో రెండు పట్టణ స్థానిక సంస్థలకు ఒక ఉమ్మడి ఇన్‌టేక్ బావి కావాలని నీటిపారుదల శాఖ తలచింది. మూడు పైపులైనులకు అనువుగా వంతెనను వెడల్పు చేయవలసి వచ్చింది. దీనిని 2011 ఫిబ్రవరిలో కమిటీ సమావేశంలో కూడా ఆమోదించిందని ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). ఐతే, అదే సమావేశం తీర్మానం ప్రకారం కాలినడక వంతెన నిర్మాణం ప్రధాన పనికి సంబంధించినదే (కంటింజెంట్) కనుక ఈ సమాధానం ఆమోదయోగ్యంకాదు. |
| వరంగల్ నీటి సరఫరా పథకం | బీమా ప్రీమియం చెల్లింపులకోసం అంతర్గత అంచనాలలో (ఐబీఎమ్) ₹1.18 కోట్లు చేర్చగా, గుత్తేదారు బీమా ప్రీమియం ₹47 లక్షలు మాత్రమే చెల్లించారు.<br>మిగతా ₹71 లక్షలను గుత్తేదారు నుంచి వసూలు చేస్తామని ప్రభుత్వం హామీఇచ్చింది (2012 డిసెంబరు). |

## 4.8 పర్యవేక్షణ, మూల్య నిర్ధారణ

రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ, పీఎమ్‌యూ తమ బాధ్యతలు నిర్వహించటంలో ఈ దిగువ లోపాలు బయటపడ్డాయి :

- ప్రాజెక్టులు ప్రారంభించిన తరువాతనే వాటి అమలును పర్యవేక్షించేందుకు టీపీఐఎమ్ఏలు/ఐఆర్ఎమ్ఏలను నియమించినట్లు మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టుల విషయంలో ఆడిట్ గమనించింది. ఫలితంగా ఆయా ప్రాజెక్టుల నిర్మాణాలకు ముందు దశలలో ఈ పర్యవేక్షక సంస్థల పాత్రలేదు.
- టీపీఐఎమ్ఏలు గమనించిన విషయాల మీద చర్యలు తీసుకున్న నివేదికల గురించి ఆడిట్ అడిగిన ప్రశ్నకు రాష్ట్ర స్థాయి నోడల్ ఏజన్సీ బదులివ్వలేదు. ప్రత్యేకించి, తిరుపతిలో గృహనిర్మాణం విషయమై టీపీఐఎమ్ఏ తీవ్ర అభ్యంతరాలు కొన్ని లేవనెత్తింది. పనులను పెద్దసంఖ్యలో విభజించటం, ఈపీసీ విధానం అనుసరించక పోవటం, సవరించిన వ్యయానికి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లేకుండానే చెల్లింపులు చేయటం వంటివి ఇందులో ఉన్నాయి. టీపీఐఎమ్ఏ నివేదికలలో లేవనెత్తిన వాదాంశాలను వాస్తవంగా చక్కదిద్ది పరిష్కరించినట్లు మేము నిశ్చయంగా తెలుసుకొనలేకపోయాము. తిరుపతి ప్రాజెక్టులో పనులను విభజించటానికి కారణాలను వివరించినప్పుడు ప్రభుత్వం టీపీఐఎమ్ఏ నివేదికల మీద తీసుకున్న చర్యల గురించి ప్రస్తావించలేదు.
- పీఎమ్‌యూ దృష్టిసారించవలసిన అంశాలలో కార్యక్రమ నిర్వహణ, ప్రాజెక్ట్ మానిటరింగ్ అండ్ ఎవాల్యుయేషన్ (పీఎమ్ఈఎస్) అనే వెబ్ ఆధారిత వ్యవస్థ ద్వారా కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు నివేదించటం ఒకటి. నిధులను కార్యసాధకంగా వినియోగించటం, ప్రాజెక్టుల పురోగతి, సంస్కరణల అమలు వంటి వాటిని ఈ మానిటరింగ్ వ్యవస్థ విశ్లేషించాలి. ఐతే, పీఎమ్ఈఎస్ పూర్తి స్థాయిలో పనిచేయటంలేదని నోడల్ ఏజన్సీ కూడా అంగీకరించింది. ప్రాజెక్టులవారీగా సమగ్ర సమాచారం పీఎమ్ఈఎస్ ద్వారా నోడల్ ఏజన్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో లేదు. నోడల్ ఏజన్సీ స్థాయిలో ప్రాజెక్టు పర్యవేక్షణ చూసుకోవటానికి 2008 అక్టోబరులో కేంద్రీయ పర్యవేక్షక విభాగాన్ని (సీఎమ్‌యూ) నెలకొల్పినట్లు ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు). ఈ విభాగం పనితీరును తర్వాత విశ్లేషించి, అవసరమైన సేవలను ఇది అందించలేదని తేల్చి, 2009 అక్టోబరులో దీన్ని మూసేశారు. ఐతే, ఒక వర్గం పట్టణ స్థానిక సంస్థలలో జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ పథకం కింద అమలవుతున్న ప్రాజెక్టులను పర్యవేక్షించటంకోసం నోడల్ ఏజన్సీ స్థాయిలో కొందరు నోడల్ అధికారులను నియమించారు.

## 4.9 ప్రభావ విశ్లేషణ

ఆయా ప్రాజెక్టుల అమలు ప్రభావంపట్ల ప్రజల అవగాహనను అంచనా వేసే దిశగా 20 ప్రాజెక్టులకు సంబంధించి 1528 మంది లబ్ధిదారులను యాధృచ్ఛిక నమూనా విధానంలో ఆడిట్ అధికారులు 2011 మే, 2012 మార్చి నెలల మధ్యన సర్వే చేశారు. ఈ ప్రాజెక్టులలో మురుగునీటి పారుదలవి 5, నీటిసరఫరా ప్రాజెక్టులు 7, వరదనీటి కాలువలు 3, గృహనిర్మాణ పథకాలు 5 ఉన్నాయి.

### 4.9.1 మురుగునీటి పారుదల

మురుగునీటి పారుదల ప్రాజెక్టుల[36] గురించి సర్వే చేసిన వారిలో 85-90 శాతం తమ సంతృప్తిని వ్యక్తంచేశారు. ఈ ప్రాజెక్టులు చేపట్టటం వలన తమ ప్రాంతాలలో మురుగునీటి సమస్య తగ్గిందని వారు తెలిపారు. అదే సమయంలో, వీరిలో చాలామంది (55 శాతం) మిగతా ప్రాజెక్టులు పూర్తికాకపోవటంతో వాటి గురించి తమకు తెలియదన్నారు. ఫలితంగా వారింకా సెప్టిక్ టాంక్‌ల మీదనే ఆధారపడుతున్నారు (*శేరిలింగంపల్లిలో మురుగునీటి పారుదల బృహత్ ప్రణాళిక - హైదరాబాద్‌కు చెందిన ప్రాజెక్టు*).

### 4.9.2 నీటి సరఫరా

నీటి సరఫరా ప్రాజెక్టులు మూడింటికి[37] సంబంధించిన లబ్ధిదారులు తమకు నీటి సరఫరా మెరుగుపడిందని సంతోషం వ్యక్తం చేయగా, మిగతా నాలుగు[38] ప్రాజెక్టులు తమ అవసరాలు తీర్చలేకపోతున్నాయని ఆ ప్రాంత ప్రజలు తమ అసంతృప్తి వెలిబుచ్చారు. నీటిని రోజుకు గంటకూడా సరఫరా చేయకపోవటం, ప్రతిరోజూ సరఫరా చేయకపోవటం, తగిన ఒత్తిడి లేకపోవటంతో మోటర్ల ద్వారా అందించటం వంటి ఇబ్బందుల నెదుర్కొంటున్నట్టు వారు తెలిపారు. ప్రాజెక్టులు పూర్తికాక, నీటి సరఫరాలో ఆశించిన లక్ష్యాలు సాధించక పోవటంవలన ఈ సమస్యలు తలెత్తుతున్నాయి.

### 4.9.3 వరదనీటి కాలువలు

వరదనీటి కాలువలకు[39] సంబంధించిన లబ్ధిదారులు మొత్తంమీద తమ సంతృప్తి వ్యక్తం చేశారు. తమ ప్రాంతాలలో వరద ముంపు చాలావరకు తగ్గిపోయిందని వారు హర్షం వెలిబుచ్చారు. ఒక్క ప్రాజెక్టుకి[40] సంబంధించి మాత్రం 8-12 శాతం లబ్ధిదారులు తమ ప్రాంతంలో నీరు నిలుస్తోందనీ, అపరిశుభ్ర వాతావరణం నెలకొన్నదనీ తెలిపారు. *ఎస్ఎల్ కాలువ క్రమబద్ధీకరణ, ఎర్రిగడ్డ వరదనీటి కాలువ, బ్రాంచి కాలువల విస్తరణ* ప్రాజెక్టులను స్వయంగా పరిశీలించినప్పుడు ఈ ప్రాంత ప్రజలు పెద్ద మొత్తంలో చెత్తను కాలువలలో వేస్తున్నట్లు తెలిసింది. ఈ సమస్యను జీవీఎమ్‌సీ పరిష్కరించవలసి ఉంది.

---

[36] 1. పాతబస్తీలో మూసీనది దక్షిణాన (జోన్-I) మురుగునీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ, 2. పాతబస్తీలో మూసీనది దక్షిణాన (జోన్-II) మురుగునీటి పారుదల పునరుద్ధరణ, విస్తరణ, 3. శేరిలింగంపల్లి మునిసిపాలిటీలో మురుగునీటి పారుదల బృహత్ ప్రణాళిక అమలు, 4. విశాఖపట్నం మధ్యభాగానికి మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు 5. విశాఖపట్నం పాతబస్తీ ప్రాంతంలో మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు

[37] 1. జీవీఎమ్‌సీ పరిసరాల్లోని 32 ప్రాంతాలలో తాగునీటి సరఫరా, 2.జీవీఎమ్‌సీ పాతబస్తీలో సమగ్ర నీటి సరఫరా వ్యవస్థ 3. తాటిపూడి జలాశయం నుంచి పట్టణ సరఫరా జలాశయం, పంపింగ్ యూనిట్ల వరకు తాటిపూడి పైపులైను మార్చడం

[38] 1. జీవీఎమ్‌సీ మధ్య ప్రాంతంలోని ఈశాన్య మండలంలో సమగ్రనీటి సరఫరా పునరుద్ధరణ, 2. పట్టణ సరఫరా జలాశయం నుంచి ఎండాడ, కొమ్మడి కూడలి వరకు నీటి సరఫరా లైన్లు వేయటం, 3. గాజువాక ప్రాంతానికి నీటి సరఫరా మెరుగు పరచటం 4. గాజువాక ప్రాంతంలో నీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు (రెండవదశ)

[39] 1. విశాఖపట్నం మహానగర జోన్ VIII వరదనీటి కాలువల విస్తరణ (గంగులహెడ్డ, ఎర్రిగడ్డ బ్రాంచి కాలువలు) 2. ఎస్ఎల్ కాలువ క్రమబద్ధీకరణ, 3. ఎర్రిగడ్డ వరదనీటి కాలువ, బ్రాంచికాలువల మరమ్మతులు

[40] విశాఖపట్నం మహానగరం జోన్ VIII వరదనీటి కాలువల విస్తరణ (గంగులహెడ్డ, ఎర్రిగడ్డ బ్రాంచి కాలువలు)

### 4.9.4 గృహ నిర్మాణం

గృహనిర్మాణానికి సంబంధించిన సర్వేలో విజయవాడ లబ్ధిదారులు తమ సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణంలో నాణ్యతతోపాటు ఆప్రాంతంలో వసతులు కూడా బాగున్నాయని చెప్పారు. ఇందుకు భిన్నంగా హైదరాబాదు, తిరుపతి పట్టణాలలో లబ్ధిదారులు ఇళ్ళ పరిమాణం తక్కువగా ఉండటం, మంచినీటి/మురుగునీటి వసతులు లేకపోవటం, రోడ్ల పరిస్థితి సరిగా లేకపోవటం, చెత్తకుప్పలనుంచి దుర్వాసన వెలువడటం వంటి విషయాలలో తమ అసంతృప్తి వెలిబుచ్చారు. తిరుపతిలోని లబ్ధిదారులు తమ ప్రాంతానికి సమీపంలో ఆసుపత్రి, బస్టాపులు లేవని కూడా నివేదించారు.

ప్రాజెక్టులు పూర్తయిన తరువాత వాటి ప్రభావాన్ని అక్కడి ప్రజలు గుర్తిస్తారనీ, అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటామనీ ప్రభుత్వం తెలిపింది (2012 డిసెంబరు).

## 4.10 సారాంశం

*పై పేరాలలో వెలిబుచ్చినట్లు ఆదేశక, ఐచ్ఛిక సంస్కరణలను ప్రభుత్వం ఎంతో సంతృప్తికరంగా అమలు చేయగా, మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టులలో అధిక భాగం తగినంత స్థలం అందుబాటులో లేకపోవటం, లోపభూయిష్టమైన డిజైన్ల వలన నిర్మాణాల మీద ఇది ప్రతికూల ప్రభావం చూపింది. సంబంధిత శాఖలతో సమన్వయం కొరవడటం, పనులను అనేక భాగాలుగా విభజించటం, సాంకేతిక విధానాలు మార్చటం వంటివి పలు చోట్ల పనులు పూర్తి కాకపోవటానికి ఆశించిన లక్ష్యాలు, ప్రయోజనాలు సాధించలేకపోవటానికి దారితీశాయి. టెండర్, కాంట్రాక్టు నిర్వహణ ప్రక్రియలలో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయి. పనులను సింగిల్ టెండర్/నామినేషన్ ప్రాతిపదికన అప్పగించటం వలన గుత్తేదారులకు అనుచిత ప్రయోజనం కలగటం ఇందులో ఒకటి. పనులను సకాలంలో నిర్ణీత నాణ్యతా ప్రమాణాలతో పూర్తయ్యేలా చూసేందుకు పర్యవేక్షణ యంత్రాంగం చాలినంతగా లేదు.*

## 4.11 సిఫార్సులు

- సర్వే నివేదికలనుంచి వాస్తవిక సాధకాలను గ్రహించి నిర్మాణం మొదలు పెట్టేముందే సమగ్ర ప్రాజెక్టు నివేదికలను పటిష్టంగా రూపొందించేలా ప్రభుత్వం చూడాలి. అవసరమైన ముందస్తు ఏర్పాట్లు అన్నీ ఒనగూరేలా సరిచూసుకోవాలి (ముఖ్యంగా స్థలసేకరణ, వివిధ శాఖల నుంచి అనుమతులు).
- అనుమతులు ఇవ్వవలసిన ఇతర శాఖలతో కార్యసాధకమైన సమన్వయం సాధించాలి.
- రెండంచెల టెండర్ ప్రక్రియకు (సర్వే, పరిశోధన, నిర్మాణం) సంబంధించి ప్రభుత్వ ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలి.
- ప్రాజెక్టులు సకాలంలో, నిర్ణీత వ్యయంలో పూర్తయ్యేలా మార్గదర్శకాలలో నిర్దేశించినట్లు పర్యవేక్షణ యంత్రాంగాన్ని బలోపేతం చేయాలి.